

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 06-07-2025 | సంపుటి - 24 | సంచిక - 63 | రూ : 4 | పేజీలు: 8




2లో

## అమరావతికి మరో 20 వేల ఎకరాలు

- సీఆర్డీఏ గ్రీన్ సిగ్నల్
- సీఎం చంద్రబాబు నివాసంలో ముగిసిన సీఆర్డీఏ 50వ సమావేశం
- రాజధానిలో అదనంగా 20,494 ఎకరాల భూ సమీకరణకు ఆమోదం
- హైడెన్సిటీ రెసిడెన్షియల్ జోన్లకు ఆర్ఎఫ్‌పీ పిలిచేందుకు గ్రీన్ సిగ్నల్
- నగరంలో నాలుగు కొత్త కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి ఓకే
- నిర్మాణ పనుల కోసం ఇసుక డ్రెడ్జింగ్‌కు సీఆర్డీఏకు అనుమతి
- గోపీచంద్ అకాడెమీ, ఎమ్మెస్కే ప్రసాద్ అకాడెమీ సహా 16 సంస్థలకు భూ కేటాయింపులు

## టీడీపీ కార్యకర్తకు క్యాన్సర్...
# వీడియో కాల్ మాట్లాడిన సీఎం

- క్యాన్సర్‌తో బాధపడుతున్న టీడీపీ కార్యకర్త ఆకుల కృష్ణ
- చంద్రబాబుతో మాట్లాడాలన్న తన కోరిక వెల్లడి
- విషయం తెలుసుకొని స్వయంగా వీడియో కాల్ చేసిన సీఎం
- కృష్ణ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన ముఖ్యమంత్రి
- అన్ని విధాలా అండగా ఉంటానని కుటుంబానికి భరోసా
- సీఎం ఫోన్‌తో సంతోషం వ్యక్తం చేసిన కార్యకర్త

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన పార్టీకి చెందిన ఓ కార్యకర్త పట్ల మానవత్వం చాటుకున్నారు. క్యాన్సర్‌తో పోరాడుతూ తీవ్ర అనారోగ్యంతో ఉన్న అభిమానికి స్వయంగా వీడియో కాల్ చేసి పరామర్శించి, ఆయన చివరి కోరికను నెరవేర్చారు. రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలోని

తరువాయి 2లో





2లో

## అలాంటి వారిని
# వదిలిపెట్టే ప్రసక్తే లేదు..

- సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ వార్నింగ్
- చిన్నారులపై లైంగిక దాడుల నివారణపై హైదరాబాద్‌లో సదస్సు
- మహిళలు, పిల్లల భద్రతకే తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్న సీఎం
- నేరస్థులను కఠినంగా శిక్షిస్తామని, ఎవరినీ వదిలిపెట్టమని హెచ్చరిక
- భరోసా కేంద్రాల ద్వారా బాధితులకు పూర్తి అండగా నిలుస్తున్నామని వెల్లడి

# అర్జెంటీనాలో అడుగుపెట్టిన ప్రధాని మోదీ..



## ప్రవాస భారతీయుల ఆత్మీయ స్వాగతం

- అర్జెంటీనా పర్యటనకు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ
- బ్యూనస్ ఎయిర్స్‌లో ప్రవాస భారతీయుల ఘన స్వాగతం
- 'మోదీ-మోదీ' నినాదాలతో హోరెత్తించిన హోటల్ ప్రాంగణం
- 57 ఏళ్ల తర్వాత అర్జెంటీనాకు వెళ్లిన భారత ప్రధాని

అర్జెంటీనా పర్యటనకు వెళ్లిన భారత ప్రధాని నరేంద్ర మోదీకి అక్కడ ఘన స్వాగతం లభించింది. బ్యూనస్ ఎయిర్స్‌లోని అల్వియర్ ప్యాలెస్ హోటల్‌కు చేరుకున్న ఆయనకు అక్కడి ప్రవాస భారతీయులు 'మోదీమోదీ', 'జై హింద్', 'భారత్ మాతా కీ జై' నినాదాలతో బ్రహ్మరథం పట్టారు. దీంతో హోటల్ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

తరువాయి 2లో

## చదువు కోసం కమిషనర్‌ను వేడుకున్న చిన్నారులు..
## చలించిపోయిన మంత్రి నారా లోకేశ్



2లో

- చదువు చెప్పించాలని కమిషనర్‌ను వేడుకున్న నెల్లూరు చిన్నారులు
- వారి దీనస్థితిపై స్పందించిన మంత్రి నారా లోకేశ్
- పిల్లల విద్యాభ్యాసానికి ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం
- పేదరికాన్ని జయించే ఆయుధం చదువేనని వ్యాఖ్య
- చిన్నారుల కలలు సాకారం చేసేందుకు అండగా ఉంటామని హామీ

## నిఫా వైరస్ కలకలం.. టీనేజ్ అమ్మాయి మృతి

- కేరళలో మళ్లీ విజృంభించిన నిఫా వైరస్

2లో



## భాగ్యనగరాన్ని ముంచెత్తిన భారీ వర్షం..
# రోడ్లన్నీ జలమయం..

- హైదరాబాద్ నగరంలో పలుచోట్ల కుండపోత వర్షం
- బేగంబజార్, కోఠి, ఖైరతాబాద్ సహా ప్రధాన ప్రాంతాలు జలమయం
- రోడ్లపై నీరు చేరడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు
- పలు ముఖ్యమైన రహదారులపై నిలిచిపోయిన ట్రాఫిక్
- పనులపై బయటకు వెళ్లిన ప్రజలు తీవ్ర అవస్థలు

2లో

## అర్జెంటీనాలో అడుగుపెట్టిన ప్రధాని మోదీ..
# ప్రవాస భారతీయుల ఆత్మీయ స్వాగతం

(మొదటిపేజీ తరువాయి)

భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా ప్రవాసులు సంప్రదాయ శాస్త్రీయ నృత్య ప్రదర్శనతో ప్రధానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మోదీ అక్కడి వారితో ఆప్యాయంగా ముచ్చటించారు. చాలా మంది ఆయన నుంచి ఆటోగ్రాఫ్‌లు అందుకుని తమ సంతోషాన్ని పంచుకున్నారు. అంతకుముందు ఎజీజా అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగిన మోదీకి అర్జెంటీనా ప్రభుత్వం లాంఛనప్రాయ స్వాగతం పలికింది. ఈ పర్యటనకు చారిత్రక ప్రాధాన్యం ఉంది. దాదాపు 57 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత ఒక భారత ప్రధాని అర్జెంటీనాలో ద్వైపాక్షిక పర్యటన చేపట్టడం ఇదే తొలిసారి. “అర్జెంటీనాతో సంబంధాలను బలోపేతం చేసే లక్ష్యంతో బ్యూనస్ ఎయిర్స్‌లో అడుగుపెట్టాను. అధ్యక్షుడు జేవియర్ మిలీతో సమావేశమై, విస్తృతంగా చర్చలు జరపడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను” అని ప్రధాని మోదీ తన అధికారిక ‘ఎక్స్’ (ట్విట్టర్) ఖాతాలో పేర్కొన్నారు. రెండు రోజుల ఈ పర్యటనలో భాగంగా మోదీ అర్జెంటీనా జాతీయ నేత జనరల్ జోస్ డి శాన్ మార్టిన్ విగ్రహానికి నివాళులర్పిస్తారు. అనంతరం అధ్యక్షుడు మిలీతో ప్రతినిధి స్థాయి చర్చలు జరుపుతారు. 2019లో భారత్‌అర్జెంటీనా సంబంధాలు వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి చేరాయి. వాణిజ్యం, రక్షణ, వ్యవసాయం, గ్రీన్ ఎనర్జీ వంటి పలు కీలక రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకారం కొనసాగుతోంది.

# చదువు కోసం కమిషనర్‌ను వేడుకున్న చిన్నారులు...



చదువుకోవాలన్న తపనతో ఇద్దరు చిన్నారులు అధికారులను వేడుకున్న ఘటనపై రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా చలించిపోయారు. ఆ పిల్లల విద్యాభ్యాసానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను తక్షణమే ఆదేశించారు. వారి కలలను సాకారం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. వివరాల్లోకి వెళితే, నెల్లూరు నగరంలోని వీఆర్ స్కూలు వద్ద పెంచలయ్య, వెంకటేశ్వర్లు అనే ఇద్దరు చిన్నారులు తమను బడిలో చేర్పించాలంటూ కమిషనర్‌ను ప్రాధేయపడ్డారు. ఈ విషయం మీడియా ద్వారా వెలుగులోకి రావడంతో మంత్రి లోకేశ్ దృష్టికి వెళ్లింది. ఈ ఘటనపై ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. “చిన్నారులు తమకు చదువు చెప్పించాలని కమిషనర్‌ను ప్రాధేయపడటం నన్ను కదిలించింది. వారి చదువుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాల్సిందిగా అక్కడి అధికారులను ఆదేశించాను” అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. పేదరికం నుంచి బయటపడటానికి విద్య ఒక్కటే బలమైన సాధనమని లోకేశ్ అభిప్రాయపడ్డారు. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరాలన్న కసి, పట్టుదల ఉంటే ఎలాంటి కష్టాలనైనా అధిగమించవచ్చని ఆయన అన్నారు. ఈ చిన్నారుల ఆశయ సాధనకు ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. ఈ మేరకు ఓ వెబ్‌సైట్‌లో వచ్చిన కథనాన్ని కూడా ఆయన తన పోస్టుతో పాటు పంచుకున్నారు.

## భాగ్యనగరాన్ని ముంచెత్తిన భారీ వర్షం..
## రోడ్లన్నీ జలమయం

భాగ్యనగరంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఆకస్మికంగా కురిసిన కుండపోత వర్షానికి నగరంలోని పలు ప్రధాన ప్రాంతాలు జలమయమయ్యాయి. కార్యాలయాలు, ఇతర పనుల నుంచి ఇళ్లకు తిరిగి వెళ్లే నగరవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నగరంలోని కోఠి, బేగంబజార్, అబిడ్స్, సుల్తాన్ బజార్, బషీర్ బాగ్, నాంపల్లి, హిమాయత్ నగర్, నారాయణ గూడ, లక్డీకాపుల్, ఖైరతాబాద్, ట్యాంక్ బండ్ వంటి కీలక ప్రాంతాల్లో రహదారులు నీటితో నిండిపోయాయి. రోడ్లన్నీ చెరువులను తలపించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. వర్షం కారణంగా వాహనదారులు, పాదచారులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి అవస్థలు పడ్డారు.

# నిఫా వైరస్ కలకలం.. టీనేజ్ అమ్మాయి మృతి

* **మలప్పురంలో 18 ఏళ్ల యువతి మృతి**
* **మృతురాలికి చికిత్స అందించిన 43 మంది వైద్య సిబ్బందికి క్వారంటైన్**

కేరళలో ప్రాణాంతక నిఫా వైరస్ మళ్లీ కలకలం రేపుతోంది. ఈ వైరస్ కారణంగా ఓ యువతి మృతి చెందింది. మరొకరు చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో, రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు కీలక జిల్లాల్లో హైఅలర్ట్ ప్రకటించింది. వివరాల్లోకి వెళితే, మలప్పురం జిల్లాకు చెందిన 18 ఏళ్ల ఇంటర్ విద్యార్థిని నిఫా బారిన పడి జులై 1న ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మృతి చెందింది. తీవ్రమైన జ్వరం, వాంతులతో బాధపడుతున్న ఆమెను కొట్టక్కల్‌లోని ఆసుపత్రికి తీసుకురాగా, అప్పటికే బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇదే సమయంలో, పాలక్కాడ్‌కు చెందిన 39 ఏళ్ల మహిళ కూడా ఇదే వైరస్‌తో బాధపడుతున్నట్లు తేలింది. వీరిద్దరి నమూనాలను పూణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపగా, నిఫా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఈ పరిణామంతో కేరళ ఆరోగ్య శాఖ వెంటనే రంగంలోకి దిగింది. ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్.. కోజికోడ్, మలప్పురం, పాలక్కాడ్ జిల్లాల్లో హైఅలర్ట్ జారీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ముందుజాగ్రత్త చర్యగా, మరణించిన యువతికి చికిత్స అందించిన 43 మంది ఆరోగ్య సిబ్బందిని క్వారంటైన్‌లో ఉంచారు. నిఫా అనేది జంతువుల నుంచి, ముఖ్యంగా గబ్బిలాలు, పందుల ద్వారా మనుషులకు వ్యాపించే ఒక వైరల్ వ్యాధి. ఇది సోకిన వారిలో తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులతో పాటు మెదడువాపు (ఎన్‌సెఫలైటిస్) లేదా తీవ్ర శ్వాసకోశ సమస్యలకు దారితీస్తుంది. దీనికి నిర్దిష్టమైన చికిత్స లేకపోవడంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ దీనిని అత్యంత ప్రమాదకరమైన వ్యాధుల్లో ఒకటిగా పరిగణిస్తోంది.

# అమరావతికి మరో 20 వేల ఎకరాలు

రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. రాజధాని పరిధిలో అదనంగా 20 వేల ఎకరాలకు పైగా భూమిని సమీకరించేందుకు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్డీఏ) అథారిటీ ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఉండవల్లిలోని నివాసంలో జరిగిన 50వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో మొత్తం 7 ప్రధాన అంశాలపై చర్చించి ఆమోదముద్ర వేశారు. ఇందులో భాగంగా అమరావతి, తుళ్లూరు మండలాల్లోని ఏడు గ్రామాల్లో కలిపి మొత్తం 20,494 ఎకరాల భూమిని సమీకరించాలన్న ప్రతిపాదనకు అథారిటీ పచ్చజెండా ఊపింది. దీంతో పాటు, రాజధానిలో అభివృద్ధి పనులను పరుగులు పెట్టించేందుకు మరికొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. మందడం, రాయపూడి, పిచుకలపాలెం వంటి ప్రాంతాల్లో హైడెన్సిటీ రెసిడెన్షియల్ జోన్లు, మిశ్రమ అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణం కోసం ఆసక్తి వ్యక్తీకరణ (ఆర్ఎఫ్‌పీ) పిలిచేందుకు అనుమతించారు. అంతేకాకుండా, అమరావతిలో నిర్మించనున్న ఫైవ్‌స్టార్ హోటళ్లకు సమీపంలో నాలుగు చోట్ల కన్వెన్షన్ సెంటర్లను నిర్మించే ప్రతిపాదనకు కూడా ఆమోదం లభించింది. రాజధాని నిర్మాణ పనులకు ఇసుక కొరత లేకుండా చూసేందుకు, ప్రకాశం బ్యారేజీ ఎగువన డీసిల్టేషన్ ప్రక్రియ ద్వారా ఇసుకను తవ్వుకునేందుకు సీఆర్డీఏకు అనుమతి ఇచ్చారు. రానున్న రెండేళ్లలో నిర్మాణాలకు 159.54 క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరమవుతుందని అధికారులు అంచనా వేశారు. కేబినెట్ సబ్ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు సీబీఐ, జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడెమీ, ఎమ్మెస్కే ప్రసాద్ క్రికెట్ అకాడెమీ, కిమ్స్ హాస్పిటల్ సహా 16 ప్రముఖ సంస్థలకు 65 ఎకరాల భూమిని కేటాయించేందుకు కూడా సీఆర్డీఏ అంగీకరించింది. వీటితో పాటు రాజధానిలోని ఈ15 రహదారిపై ఆరు లేన్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణానికి, పొట్టి శ్రీరాములు, అల్లూరి సీతారామరాజు స్మారక చిహ్నాల ఏర్పాటుకు స్థలం కేటాయించేందుకు కూడా ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్తకు క్యాన్సర్...
# వీడియో కాల్ మాట్లాడిన సీఎం చంద్రబాబు

మోరంపూడి జంక్షన్‌కు చెందిన ఆకుల కృష్ణ, మొదటి నుంచి తెలుగుదేశం పార్టీకి వీరాభిమానిగా ఉన్నారు. చంద్రబాబు అంటే ఆయనకు ఎనలేని అభిమానం. అయితే, కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ ఆరోగ్యం క్షీణిస్తుండటంతో, జీవితంలో ఒక్కసారైనా చంద్రబాబుతో మాట్లాడాలని తన ఆకాంక్షను వెలిబుచ్చారు. ఈ విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి వెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. ఆకుల కృష్ణకు నేరుగా వీడియో కాల్ చేసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని కృష్ణకు, ఆయన కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. సరిగా మాట్లాడలేని స్థితిలో ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి స్వయంగా ఫోన్ చేయడంతో ఆకుల కృష్ణ తీవ్ర ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పుడు తనకు ఎంతో సంతృప్తిగా ఉందని తెలిపారు.

## అలాంటి వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు..
# సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ వార్నింగ్...

చిన్నారులపై లైంగిక దాడులకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, వారికి అత్యంత కఠినమైన శిక్షలు తప్పవని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో శనివారం "లైంగిక దాడుల బాధిత చిన్నారుల రక్షణ, భద్రత" అనే అంశంపై నిర్వహించిన ఒక సదస్సులో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నారులపై జరిగే లైంగిక హింసను సమాజంలో ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. బాధితులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాలు ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. వాటి ద్వారా బాధితులకు పూర్తి భద్రత, సహకారం అందిస్తున్నామని వివరించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ప్రజలు, ముఖ్యంగా యువత సోషల్ మీడియా వాడకం విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఈ కీలకమైన సదస్సులో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, హైకోర్టు న్యాయమూర్తులు, డీజీపీ జితేందర్, ఇతర ఉన్నత పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# శేషాచలం ఫారెస్ట్ లో 'పుష్ప' సీన్... పోలీసులపై స్మగ్లర్ల దాడి

* **శేషాచలంలో పోలీసులపై ఎర్రచందనం స్మగ్లర్ల ఎదురుదాడి**
* **అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండలంలో చోటుచేసుకున్న ఘటన**
* **తమిళనాడుకు చెందిన స్మగ్లర్ గోవిందన్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు**
* **రూ. 80 లక్షల విలువైన 26 ఎర్రచందనం దుంగలు స్వాధీనం**
* **తప్పించుకున్న మరో 10 మంది కోసం ముమ్మర గాలింపు**
* **స్మగ్లర్ల నుంచి కత్తులు, గొడ్డళ్లు స్వాధీనం చేసుకున్న అధికారులు**

శేషాచలం అడవుల్లో 'పుష్ప' సినిమా సీన్ కనిపించింది. ఎర్రచందనం స్మగ్లర్లు మరోసారి రెచ్చిపోయారు. అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులపైనే ఎదురుదాడికి దిగారు. ఈ ఘటన అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండలంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఈ దాడిలో ఒక స్మగ్లర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు, సుమారు రూ. 80 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే, సుండుపల్లి మండలం కావలిపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలను ఒక డంపింగ్ కేంద్రం నుంచి తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని స్మగ్లర్లను పట్టుకునేందుకు ప్రయత్నించారు. అయితే, పోలీసులను చూసిన సుమారు 11 మంది స్మగ్లర్లు, కూలీలు వారిపై కత్తులు, గొడ్డళ్లతో దాడి చేసి తప్పించుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులు ధైర్యంగా వారిని ఎదుర్కొని, తమిళనాడుకు చెందిన గోవిందన్ అనే స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన 10 మంది అక్కడి నుంచి పరారయ్యారు. ఈ సందర్భంగా, రూ. 80 లక్షల విలువ చేసే 26 ఎర్రచందనం దుంగలతో పాటు, రెండు కత్తులు, రెండు గొడ్డళ్లను



స్వాధీనం చేసుకున్నట్లు అదనపు ఎస్పీ వెంకటాద్రి తెలిపారు. గోవిందన్‌పై గతంలోనూ ఇలాంటి నాలుగు కేసులు ఉన్నాయని ఆయన వెల్లడించారు. పరారైన స్మగ్లర్ల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు ఆయన వివరించారు. తమిళనాడు నుంచి కొందరు వ్యక్తులు ఈ ప్రాంతంలో స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నట్లు సమాచారం ఉండటంతో గ్రామాల్లో నిఘా పెంచామని పోలీసులు తెలిపారు.

# విద్యావిధానంలో వస్తున్న మార్పులకనుగుణంగా రోబోటిక్ విద్య ఎంతో అవసరం

* **బిఆర్ఎస్ పార్టీ విప్,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్.**
* **చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో రోబోటిక్,ఏఐ ల్యాబ్ ప్రారంభం.**









జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : విద్యావిధానంలో వస్తున్న మార్పులకనుగుణంగా రోబోటిక్ విద్య ఎంతో అవసరమని బిఆర్ఎస్ పార్టీ విప్,కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. శనివారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి భగత్ సింగ్ మార్గ్ లో గల చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో రోబోటిక్ ల్యాబ్ ,ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏ.ఐ.) తరగతి గదులను మేడ్చల్ జిల్లా విద్యాధికారిణి ఐ.విజయకుమారి,స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ లు ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు,చైతన్య విద్యాసంస్థల చైర్మన్,కరస్పాండెంట్ శివరాత్రి యాదగిరి తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ల్యాబ్ ను వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ మాట్లాడుతూ నేటి విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకొని ఎదగాలన్నారు. రోబోటిక్ ద్వారా సులభతరంగా పాఠ్యాంశాలు విద్యార్థులు అర్థం చేసుకోవచ్చన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని చైతన్య పాఠశాలలో రోబోటిక్,ఏఐ ల్యాబ్ ఏర్పాటు చేయడం పట్ల పాఠశాల యాజమాన్యానికి అయన అభినందనలు తెలిపారు. మేడ్చల్ జిల్లా విద్యాధికారిణి ఐ.విజయకుమారి మాట్లాడుతూ రోబోటిక్ విద్య ద్వారా విద్యార్థుల్లో మరింత నైపుణ్యం పెరుగుతుందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా అన్ని విధాలుగా ప్రోత్సహించాలన్నారు.అదునాతన రీతిలో పాఠశాలలో ల్యాబ్ ఏర్పాటు చేసి విద్యార్థుల



బంగారుభవితకు పునాదులు వేస్తున్న చైతన్య విద్యానికేతన్ విద్యాసంస్థల చైర్మన్,కరస్పాండెంట్ శివరాత్రి యాదగిరిని డిఈఓ ప్రత్యేకంగా అభినందించారు.అనంతరం ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు, పాఠశాల కరస్పాండెంట్ శివరాత్రి యాదగిరి మాట్లాడుతూ పేద,మధ్యతరగతి కుటుంబాలు ఉంటున్న ఈ ప్రాంతంలో అతి తక్కువ ఫీజులతో మెరుగైన విద్యను అందిస్తూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జె.నాగరాజు,కోశాధికారి పరుశురాం గౌడ్, కుత్బుల్లాపూర్ మండల అధ్యక్ష కార్యదర్శులు కే. శ్రీనివాస్ చారి,నర్సిరెడ్డి, కోశాధికారి శ్రీకాంత్,బాలానగర్ మండల అధ్యక్ష కార్యదర్శులు సుశీల్ కుమార్,కాశిరెడ్డి,కూకట్ పల్లి కోశాధికారి సుబ్రహ్మణ్యం,బోరబండ అధ్యక్షులు షోయబ్,ఘట్ కేసర్ అధ్యక్షులు అంజన్ రెడ్డి,ఉప్పల్ అధ్యక్షులు విజయేందర్ రెడ్డి,మాజీ అధ్యక్షులు ధన్ సాగర్ తో పాటు వివిధ పాఠశాలల కరస్పాండెంట్ లు, స్థానిక నాయకులు రుద్ర అశోక్, పాపులు గౌడ్,వేణుయాదవ్,మహమూద్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పురాతనమైన మర్రి తాటి చెట్లు నరికేసిన వ్యక్తులపై చర్యలు తప్పవు

* **మేడ్చల్ జిల్లా అటవీ అధికారి రేణుక**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : జీవరాశులకు ఆవాసంగా ఉన్న వంద ఏళ్ళ నాటి పురాతనమైన మర్రి మహా వృక్షం చెట్టును నరికేసిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని మేడ్చల్ జిల్లా అటవీ అధికారి రేణుక స్పష్టం చేశారు. కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ పరిధిలోని శివ సాయి నగర్ లో నరికివేతకు గురైన ఏళ్ల కాలం నాటి మర్రి మహావృక్షాన్ని శనివారం జిల్లా అటవీ డిప్యూటీ రేంజర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా అటవీ అధికారి రేణుక సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహా మర్రి వృక్షం నరికివేతతో పక్షులు చనిపోయిన విషయాన్ని గుర్తించామన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి సంతకాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డి, శివ సాయి నగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు కొండగళ్ల అశోక్ బింగి బిక్షపతి గౌడ్, కందుల సత్యనారాయణ, షాబాద్ దామోదర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, సరికొండ రమేష్, సత్యనారాయణ, గోపాలకృష్ణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బాబు జగ్జీవన్ రావు ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలి

* **ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : దేశ సామాజిక న్యాయం సాధనకు గొప్ప కృషి చేసిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం హబ్సి గూడ చౌరస్తా లో డా. బి ఆర్ అంబెడ్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు జగ్జీవన్ రామ్ విగ్రహా ఆవిష్కరణలో పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎమ్ ఆర్ పి ఎస్ అధినేత మంద కృష్ణమాదిగ తో కలిసి పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతి, అణగారిన ప్రజల సమాన హక్కుల కోసం బాబు జగ్జీవన్ రామ్ చేసిన పోరాటం మర్చిపోలేనిది. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఉపప్రధానిగా దేశ సేవకు అంకితమైన ఆయన జీవితం స్ఫూర్తిదాయకం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్ ఆర్ ఓ గౌతమ్, మాజీ వైస్ చైర్మన్ లక్ష్మి నారాయణ, మాజీ కౌన్సిలర్లు యాదగిరి, కైలాష్ పతి గౌడ్ సీనియర్ నాయకులు డా. చారి , సోమి రెడ్డి , మనోహర్ నవీన్ దినేష్, నరేంద్ర రాజు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## నియోజకవర్గాన్ని సర్వతోముఖాభివృద్ధి వైపుగా అభివృద్ధి చేయడమే మా బాధ్యత

* **బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని సర్వతోముఖాభివృద్ధి వైపుగా అభివృద్ధి చేయడమే మా బాధ్యత అని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. శనివారం జగద్గిరిగుట్ట డివిజన్ అంజయ్య నగర్ బి, సీ బస్తీలలో సుమారు రూ.47.00 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని అన్ని డివిజన్లలో మౌలిక వసతుల కల్పనతో సర్వతోముఖాభివృద్ధి వైపుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలుకుల జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య, శశి, బాబు గౌడ్, సయ్యద్ సాజిద్, ఇందిరా గౌడ్, త్రివేణి, నాని, పాపులు గౌడ్, మజ్జి శ్రీను, జయ కృష్ణ, మనోజ్, ముంతాజ్, గిరి, బండ మహేందర్, బ్రహ్మానంద చారి, హనుమంతు, సత్యనారాయణ, గణేష్, వెంకటేష్, మహమూద్, అంజయ్య నగర్ బి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సురేందర్, ఉపాధ్యక్షులు సోమేష్, ప్రధాన కార్యదర్శి కిరణ్, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బుచ్చిబాబు, లక్ష్మారెడ్డి, వీరేశం, సంజీవరెడ్డి, సత్యనారాయణ, కృష్ణ, జంగారెడ్డి, నందకుమార్, దుర్గాప్రసాద్, రాజు, జయశ్రీ, భూలక్ష్మి, బాలలక్ష్మి, రాధా, అమరావతి, అంజయ్య నగర్ సి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గురువయ్య, ప్రధాన కార్యదర్శి రాజు గౌడ్, ఉపాధ్యక్షులు పాండు, కోశాధికారి అశోక్ గౌడ్, కాలనీ నాయకులు నాగరాజు ముదిరాజ్, బాబురావు, అరవింద్, రాము, రమేష్, యాదగిరి, భీమయ్య, రాజశేఖర్, లాలయ్య, సుధాకర్, వెంకటయ్య, లక్ష్మి, లలిత, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి సారించాలి

* **బిఆర్ఎస్ పార్టీ విప్,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి సారించాలని బిఆర్ఎస్ పార్టీ విప్,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. శనివారం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గానికి చెందిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాల వద్ద మౌలిక వసతుల అభివృద్ధిపై బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ హౌసింగ్ కార్పొరేషన్ , మున్సిపల్ శాఖతోపాటు వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనలో భాగంగా నియోజకవర్గంలోని అన్ని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాల వద్ద మంజీరా నీటి సౌకర్యం, సివరాజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, లిఫ్ట్ ల నిర్వహణతో పాటు ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయాలని అన్నారు. కరెంట్ మీటర్లను జిహెచ్ఎంసి పేరు మీద కాకుండా లబ్ధిదారుల పేరుకు మార్చి బిల్లును ఇవ్వాలన్నారు. పారిశుద్ధ నిర్వాహణలో భాగంగా చెత్త సేకరణను చేపట్టి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎమర్జెన్సీ సమయంలో అందరికీ ఉపయోగపడే విధంగా ఆరోగ్య కేంద్రంతో పాటు మహిళ, శిశు, గర్భిణీ స్త్రీలకు ఉపయోగపడే అంగన్వాడి సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. దుండిగల్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయడంతో పాటు ఇతర మౌలిక వసతులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మున్సిపల్ కమీషనర్లు సాబేర్ అలీ, వెంకటేష్ నాయక్, హౌసింగ్ కార్పొరేషన్ ఈఈ రవీందర్, నిజాంపేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ ప్రజాప్రతినిధులు బాలాజీ నాయక్, జక్కుల కృష్ణ యాదవ్, జక్కుల శ్రీనివాస్, సునీల్ రెడ్డి, గోపాల్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంకు గురైన నాయకులను పరామర్శించిన ఎమ్మెల్యే



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో అనారోగ్యంకు గురైన పలువురు నాయకులను శనివారం బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పరామర్శించి ఓదారుస్తూ తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్త పరిచారు. ఈ సందర్భంగా అంజయ్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు శంకర్ గుప్తా గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకుని వారి నివాసంలో కోలుకుంటుండగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ వారి నివాసంలో శంకర్ గుప్తా ని పరామర్శించారు. ఈ సందర్భంగా శంకర్ గుప్తా త్వరగా కోలుకొని ప్రజా సేవలో తిరిగి ఉత్సాహంగా పాల్గొనాలని అన్నారు.అనంతరం గజ్జి ఉపేందర్ గుప్తా కుమారుడు గజ్జి సాయి గత నెల 7వ తేదీన ఇంట్లో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ కు గురై మృతి చెందారు. మృతుడు గజ్జి సాయి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ పరామర్శలో కార్పొరేటర్ కొలుకుల జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, స్థానిక బిఆర్ఎస్ నాయకులు, శ్రీ వాసవీ కన్యాకా పరమేశ్వరీ దేవస్థానం ఫౌండర్ చైర్మన్ రేగూరి ప్రవీణ్ గుప్తా, ఆర్యవైశ్య సంఘం సభ్యులు యాదె నరేందర్ గుప్తా, అంగడి సత్యనారాయణ, పులిగిల్ల నర్సింహులు, పార్శి ప్రకాష్ గుప్తా, తేరాల శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## గోనె శ్రీకాంత్ కు ఘన సన్మానం




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం ప్రకృతి ఆశ్రమం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సింగరేణి విశ్రాంత ఏ.జీ.ఎం, ప్రకృతి ఆశ్రమం గౌరవ ఉపాధ్యక్షులు గోనె శ్రీకాంత్ ,దయా కుమారి దంపతులను ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ సభకు అతిథులుగా హాజరైన వక్తలు మాట్లాడుతూ శ్రీకాంత్ శేష జీవితం సామాజిక అభివృద్ధి కార్యక్రమాలకు, రాజ్యాంగ పరిరక్షణకు, పర్యావరణ ప్రకృతి సంరక్షణలకు వెచ్చించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత గోనె శ్రీకాంత్ మాట్లాడుతూ సింగరేణి సంస్థలో సాధారణ ఉద్యోగిగా ప్రస్థానం ప్రారంభించి, అంచలంచలుగా ఎదిగి, 36 సంవత్సరాలు సంస్థలో పనిచేసే, ఏజీఎంగా కొత్తగూడెంలో రిటైర్మెంట్ పొందడం గర్వకారణంగా ఉందన్నారు. తన శేష జీవితాన్ని కుటుంబ సభ్యుల అభ్యున్నతితో పాటు, సామాజిక సమస్యలు పరిష్కారం కోసం కొంత సమయాన్ని కేటాయించనున్నట్లు వెల్లడించారు. ఘనంగా సన్మానించిన ప్రకృతి ఆశ్రమం సభ్యులకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఆశ్రమం కో ఆర్డినేటర్ సుగుణారావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో అతిథులుగా ఆశ్రమం గౌరవ అధ్యక్షులు, విశ్రాంత ప్రిన్సిపాల్, డా. బత్తుల కృష్ణయ్య, గౌరవ సలహాదారులు పర్యావరణవేత్త మొక్కల వెంకటయ్య, సింగరేణి విశ్రాంత జిఎం, బహుజన ఐక్యవేదిక కన్వీనర్ శనగ వెంకటేశ్వర్లు హాజరు కాగా, డా. జి. కనకరాజు, బుద్ధిస్ట్ కొచ్చర్ల కమలా రాణి, కే హెచ్ ప్రసాద్, అంబేద్కర్ రైటిస్ తుంపురు శివ, మన్ కీ బాత్ మొక్కల రాజశేఖర్, ప్రముఖ సింగర్ మేదర వెంకట ముత్యం, దయాసాగర్, జెట్టి మోహన్, తమ సందేశాలను అందించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ దంపతులకు మొక్కల ప్రేమికులు చిన్నారులు నైనిక రజ్వా, మహమ్మద్ అఫాన్ లు మొక్కలను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. టి. రాయలింగు, రగన్ బాబు, శనగ ప్రభాకర్, శనగ స్వామి, గందూరీ సంజీవరావు, జరీనా బేగం, శోభారాణి, క్రాంతిలు పాల్గొన్నారు

## బీజేపీ అధ్యక్షులు రామ చంద్ర రావుకు శుభాకాంక్షలు





జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ రాష్ట్ర అధ్యక్షునిగా రామచంద్ర రావు నాంపల్లిలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జే.కె.శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్ళారు. అనంతరం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా ఎమ్మెల్యే పగిడి రాకేష్ రెడ్డి ని, ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ ని, జిల్లా ఇన్చార్జి అధ్యక్షులు మల్లారెడ్డి లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో సురేష్ రెడ్డి , రాజేందర్ రెడ్డి , రాజు యాదవ్ , కుమార్ యాదవ్, జగన్ ముదిరాజ్, బస్తీ అధ్యక్షులు, శ్రీకాంత్ యాదవ్, నవీన్, సుధాకర్ , రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క ఛాన్స్ ప్లీజ్.....!




* గ్రామాలలో మొదలైన ఎన్నికల సందడి!:
* ఆపదలో ఆదుకుంటూ.... సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ...:
* దావత్ లు ఇస్తూ.... మద్దతు కూడగడుతూ....:
* ఒక్కో పార్టీలో పది మందికి పైగా అభ్యర్థులు!...:
* యువతరం నుండి-తల పండిన నేతల వరకు...:
* మేము సైతం అంటున్న నగరవాసులు...:



ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్ :నిన్న మొన్నటి వరకు ఎదురుడితే చూసిచూడనట్టుగా మొఖం చాటేసినవారు నేడు ఓ ఎల్లన్నా ఎటు పోతున్నవ్, ఓ మల్లన్న ఏంటి సంగతులు అంటూ తమ ఊరి ప్రజలను పిలిచి మరి మందలిస్తున్నారు. ప్రేమగా మాట్లాడుతూ వారి మదిలో తమ స్థానం ఏంటో తెలుసుకుంటున్నారు.మరి కొన్ని రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ వస్తుందనే ప్రచారం జరుగుతున్న తరుణంలో గ్రామాలలో ఎన్ని"కల" సందడి ముందస్తుగా మొదలైనట్టు కనిపిస్తుంది. ఇన్నాళ్లు గ్రామ ప్రజలకు చేదోడు వాదోడుగా ఉన్నవారి నుండి, చాలా కాలంగా ప్రజా సంబంధాలకు దూరంగా, చుట్టు పక్కల వారితో అంటిముట్టనట్టుగా వున్నవారు సైతం నేడు ప్రజలతో మమేకం అవుతూ ఎన్నికల బరిలో నిలిచేందుకు సన్నద్ధం అవుతున్నారు.నాయకులు ఒకరిని మించి మరొకరు పోటీపడుతూ తమ నిజాయితీ, నిబద్ధత, సేవాగుణాన్ని గ్రామ ప్రజలకు తెలిసేలా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మనసు గెలిచేందుకు పరిశ్రమిస్తున్నారు.ఇంకొందరు అడుగు ముందుకేసి తమ అనుకున్న వారికి దావత్ లు ఇస్తూ తన అంగ బలాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. నేనున్నానని.....:రానున్న ఎన్నికల్లో సర్పంచ్, ఎంపిటీసి గా పోటీ చేయాలనే ఆలోచన వున్న నాయకులు ముందస్తుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజా అభిమానాన్ని చూరగొనే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధిగా గ్రామ ప్రజలకు సేవ చేయాలనుకుంటున్నవారు పార్టీలతో సంబంధం లేకుండా గ్రామంలో ఎవరు మరణించినా ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్నారు. అనారోగ్య సమస్యతో బాధపడుతున్న వారి చికిత్స నిమిత్తం సహకారం అందిస్తూ అండగా నేనున్నాననే భరోసా ఇస్తున్నారు.ఇలా పిలిస్తే అలా పెళ్లిళ్లలకు,పేరంటాలకు వెళ్తూ తాను అందరివాడిననే సందేశం ఇస్తున్నారు.ప్రజా సేవా కార్యక్రమాలలో ఇప్పటికే కొంతమంది నాయకులు స్వచ్ఛందంగా లక్షల రూపాయలు ఖర్చు పెడుతూ తాము ప్రాతినిద్యం వహిస్తున్న పార్టీ అధిష్టానం దృష్టిని,గ్రామ ప్రజలను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. గ్రూప్ లు గా పార్టీలు!.....: గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక్కో గ్రామంలో పది మందికి పైగా వివిధ సామాజిక వర్గ నాయకులు సర్పంచ్ గా బరిలో నిలిచేందుకు ముందస్తుగా ప్రజల్లోకి వెళ్లడం పట్ల స్థానిక ప్రజలు ఆశ్చర్యపోతున్నారు.గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి చూడలేదని పలు గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.నూనుగు మీసాల యువకుల నుండి తల పండిన నేతల వరకు రాబోయే ఎన్నికల్లో నిలబడేందుకు అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటూ ఎవరి కోటరీ వారు నిర్మాణం చేసుకుంటున్నారు.ఇక ఒకే పార్టీ లో నలుగురైదుగురు నాయకులు ప్రజా సేవ పేరుతో గ్రామంలో కార్యక్రమాలు చేపడుతుండగా ఒక నాయకుని వెంట నడిస్తే ఇంకో నాయకుడి కి దూరం అవుతామేమో అని కార్యకర్తలు తర్జనబర్జన పడుతున్న పరిస్థితి కొన్ని గ్రామాలలో కనిపిస్తుంది. టికెట్ మనదే!....:ఓ వైపు చిన్నా, పెద్దా లీడర్ల హడావుడితో గ్రామాలలో ముందస్తుగా ఎన్నికల సందడి మొదలైనట్టుగా కనిపిస్తుండగా కొందరు మాత్రం రిజర్వేషన్ కలిసివస్తే టికెట్ తమకే వస్తుందనే ధీమాతో వుంటున్నారు.తమకు పార్టీలో సీనియరిటీ కలిసివస్తుందని కొందరు,పార్టీ గ్రామశాఖ పెద్దలకు విధేయుడిగా వున్న సిన్సియారిటి ప్రాతిపదికగా పార్టీ టికెట్ తమకే కేటాయిస్తుందని తమ అనుచరుల ముందు తమ మనోగతాన్ని వ్యక్తపరుస్తున్నారు.పార్టీ టికెట్ కోసం ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా అసలు సమయంలో తాము ఏంటో చూపిస్తాం అన్నట్టుగా వేచి చూసే ధోరణిలో పలువురు నాయకులు వున్నారు! సొంత గ్రామం వైపు అడుగులు....: స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం ఆసన్నమైన తరుణంలో హైదరాబాద్ నగరంలో జీవిస్తున్న గ్రామీణ ప్రాంతాలకు చెందినవారు సైతం గ్రామ పంచాయతీ ఎన్నికలపై ఆసక్తి చూపుతున్నారు. ఎప్పటికప్పుడు తమ గ్రామంలో జరిగే సంఘటనలను నిషితంగా పరిశీలిస్తూ అవకాశం వస్తే ఎన్నికల్లో నిలబడేందుకు మేము సైతం అంటున్నారు.సరైన సమయంలో గ్రామ రాజకీయాలలో క్రియాశీలక పాత్ర పోషించి ప్రజా సేవ చేసేందుకు "సై" అంటున్నారు. ఏది ఏమైనా సంస్థాగత ఎన్నికలు గతంలో కన్నా ఈ దఫా రసవత్తరంగా మారనున్నాయనే విషయం స్పష్టం అవుతుంది...... ఎంత మంది నేనంటే నేను అంటూ పోటీ కి సిద్ధంగా వున్నా ఏ క్షణాన అదృష్టం ఎవరిని వరిస్తుందో..... గ్రామ ప్రజలు ఎప్పుడు ఎవ్వరిని ఆశీర్వదిస్తారో ముందస్తుగా అంచనా వేయడం తల పండిన రాజకీయ ఉద్దండులకు కూడా కష్టతరమే!

## జర్నలిస్టుల కుటుంబాలకు ఉచిత వైద్య శిబిరం

**: రాచకొండ సిపీ సుధీర్ బాబు**




రాచకొండ, (ప్రజాస్ఫూర్తి) : నిత్యం సమాచార సేకరణతో వృత్తిపరమైన ఒత్తిడిని ఎదుర్కొనే జర్నలిస్టులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు పేర్కొన్నారు. తాను గతంలో ఇచ్చిన హామీ మేరకు మేడ్చల్ జిల్లాలోని జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు త్వరలోనే ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తానని ఆయన అన్నారు. శనివారం ఉప్పల్ ఎస్ వి ఎం గ్రాండ్ హోటల్ లో ఏర్పాటుచేసిన ప్రెస్ మీట్ అనంతరం టీయూడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా కార్యదర్శి దొంతుల వెంకట్రాంరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా జర్నలిస్టులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల కుటుంబాలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించేందుకు తగిన ఏర్పాటు చేయాల్సిందిగా మల్కాజ్గిరి జోన్ డీసీపీ పద్మజా రెడ్డిను కోరారు. వైద్య శిబిరంలో పాల్గొనదలచిన జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులతో కూడిన ప్రజాభితాను సిద్ధం చేసి తనకు సమర్పించాలని ఆయన ఆయన కోరారు. డిసిపి పద్మజా రెడ్డి మాట్లాడుతూ సిపి సుధీర్ బాబు ఆదేశాల మేరకు త్వరలోనే జర్నలిస్టు కుటుంబాలకు మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా హెల్త్ కమిటీ సభ్యుడు కే చంద్రమౌళి, ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షుడు పల్లా మహేందర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు కిషోర్, నరోత్తం రెడ్డి, శ్రీనివాస్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ప్రజలందరూ కులమతాలకి అతీతంగా అన్ని పండుగలు ఆనందంగా జరుపుకోవాలి

*** ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ప్రజలందరూ కులమతాలకి అతీతంగా అన్ని పండుగలు ఆనందంగా జరుపుకోవాలని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శంషిగుడా లో ఉన్న దర్గాలో గౌస్ అధ్వర్యంలో శనివారం నిర్వహించిన పీర్ల పండుగ ఉత్సవానికి ముఖ్యఅతిథిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై పీర్ల దేవుళ్ల ప్రతిమలను పూజించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉండే ముస్లింలందరూ రంజాన్, బక్రీద్ తర్వాత జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో మొహర్రం (పీర్ల పండుగ) ఒకటి అని అన్నారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, ఇమ్రాన్, పద్మారావు, సుబాబా, కళ్యాణ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరి సీతారామరాజు దొడ్డి కొమరయ్య లకు ఘన నివాళి




ప్రజాస్ఫూర్తి, కాప్రా : ప్రముఖ స్వాతంత్ర పోరాట యోధులు అల్లూరి సీతారామరాజు జయంతి , తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా ఈ సి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంస్మరణ సభ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్లో జరిగింది. ఈ కార్యక్రమానికి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ వరప్రసాద్ అధ్యక్షత వహించారు. ముందుగా అల్లూరి సీతారామరాజు, దొడ్డి కొమరయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసీ నగర్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు బి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ప్రముఖ స్వాతంత్ర పోరాట యోధులు అల్లూరి సీతారామరాజు మన్యం ప్రజలను ఏకం చేసి బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా స్వాతంత్ర పోరాటం చేశారని అన్నారు. తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్యకు ఘన నివాళులర్పించారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ సత్తిరెడ్డి మాట్లాడుతూ అల్లూరు సీతారామరాజు దొడ్డి కొమరయ్య పోరాట స్ఫూర్తిని నేటి తరానికి తెలియజేయాలని కోరారు.

*** ఈసీ నగర్ హౌసింగ్ సొసైటీ**

**కార్యదర్శి జగ్గరాజు మాట్లాడుతూ**

అల్లూరి సీతారామరాజు విప్లవ కారుడుగా స్వాతంత్ర సాధన కోసం మన్యం ప్రజలకు అండగా నిలచి బ్రిటిష్ పాలకులకపై పోరాటం చేశారన్నారు. బ్రిటిష్ పాలకులు అల్లూరి సీతారామరాజును కపటంతో మట్టుపెట్టారని అన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి మనకందరకు ఆదర్శప్రాయం అని తెలిపారు. దొడ్డి కొమరయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో మొట్టమొదటి అమరుడుగా నిలిచి తెలంగాణ సాయుధ పోరాటానికి బీజం వేశారని అన్నారు. ఆనాడు నిజాం సర్కార్ కు తాబేదారులుగా ఉన్న దేశ్ముఖులు ప్రజలను దోపిడీ చేస్తూ పోయారని దానికి వ్యతిరేకంగా పోరాడి అమరుడయ్యారని చెప్పారు. ఆనాటి పోరాట యోదులను స్ఫూర్తిగా తీసుకొని, మతతత్వ శక్తులకు, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి మల్లేష్, ఉపాధ్యక్షులు కృష్ణారెడ్డి, కోశాధికారి బాల్రెడ్డి, సహాయ కార్యదర్శి హరిప్రసాద్ శ్రీమన్నారాయణ, జి రోజా రాణి, సంజయ్ తదితరులు ఈ సభలో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎన్ వాచస్పతి, భాను కుమార్, బీవీ రాజు, తదితరులు పాల్గొన్నారు.




## వృద్ధులు టార్గెట్ అవుతున్న సైబర్ మోసాలు – అవగాహనతోనే రక్షణ

*** కుషాయిగూడ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ జి. వెంకటేశ్వర్లు**

ప్రజాస్ఫూర్తి, కాప్రా : కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని డాక్టర్ ఎస్. రావు నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రాంగణంలో శనివారం సైబర్ క్రైమ్ అవగాహన సదస్సు జరగింది. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ జి. వెంకటేశ్వర్లు, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ (ఎల్బీనగర్) ఇన్స్పెక్టర్లు నరేష్ కుమార్, సత్యనారాయణ, కుషాయిగూడ సబ్ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ ప్రాంతంలో ఎక్కువగా వృద్ధులు, పదవీ విరమణ పొందిన వారు నివసిస్తున్న నేపథ్యంతో, ముఖ్యంగా వారిని లక్ష్యంగా చేసుకొని జరుగుతున్న సైబర్ మోసాలపై అధికారులు విశదంగా వివరించారు. రోజురోజుకు పెరుగుతున్న డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించుకొని మోసగాళ్లు నూతన పద్ధతులను అవలంబిస్తున్నారని, ముఖ్యంగా వృద్ధులు డిజిటల్ అరెస్టుల పేరుతో మోసపోతున్నారని వారు హెచ్చరించారు. ఇన్స్పెక్టర్లు తమ అనుభవంలో ఎదురైన పలు మోసాల ఉదాహరణలు ప్రస్తావిస్తూ, వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచనలు ఇచ్చారు. ఎలాంటి అనుమానాస్పద కాల్స్, లింకులు, డబ్బు బదిలీలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సదస్సులో పాల్గొన్న పోలీస్ అధికారులు, ఎస్. రావు నగర్ లో నివసించే వృద్ధులకు అన్ని విధాలా తమ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. వారి సందేహాలను నివృత్తి చేస్తూ సైబర్ భద్రతకు సంబంధించిన అవగాహన కల్పించారు. అనంతరం సభ్యులందరూ పోరాటయోధుల చిత్రపటాలకు పూలను వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ సైబర్ క్రైమ్ పోలీస్ సిబ్బంది, కుషాయిగూడ పోలీస్ స్టేషన్ కు చెందిన సైబర్ వారియర్స్ రాజు , మాధవి పాల్గొన్నారు.



## కెసిఆర్ త్వరగా కోలుకోవాలని ఆలయంలో ప్రత్యేక పూజలు

రాజాపేట , ప్రజాస్ఫూర్తి : రాజపేట మండల కేంద్రంలో శ్రీ రామకృష్ణ సాయి మందిరం లో శనివారం మాజీ ముఖ్యమంత్రి, టిఆర్ఎస్ నేత కెసిఆర్ త్వరగా కోలుకోవాలని వేడుకుంటూ టిఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. రాజపేట మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కెసిఆర్ పేరున గోత్ర నామ అర్చనలు పూజలు జరిపారు. రాజపేట లోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో వేద బ్రాహ్మణుడు శ్రీ చలివేదుల రామకృష్ణ శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, 2028లో తిరిగి ముఖ్యమంత్రి కావాలని రాష్ట్రాన్ని సుపరిపాలన దిశగా కేసీఆర్ నాయకత్వంలో ముందుకు తీసుకపోవాలని మండల నాయకులు శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని, ఆలయంలోని ఇతర దేవత మూర్తులను మనస్ఫూర్తిగా కోరారు. నిండు ఆయురారోగ్యాలు తో ఉండి తెలంగాణ రాష్ట్రాన్ని కంటికి రెప్పలా కాపాడాలని మనస్ఫూర్తిగా వేడుకున్నారు. ఈ పూజ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, పిఎసిఎస్ చైర్మన్ చింతలపూరి భాస్కర్ రెడ్డి, వైస్ చైర్మన్ కాకల్ల ఉపేందర్, పార్టీ సెక్రటరీ జనరల్, పాల చైర్మన్ సంధిల భాస్కర్ గౌడ్, మండల ఉపాధ్యక్షులు ఎర్ర గోకుల జశ్వంత్, పట్టణ అధ్యక్షులు బెడిద వీరేశం, పాముకుంట అధ్యక్షుల మొలుగు సోమలింగం, పిఎసిఎస్ డైరెక్టర్ జన్నపల్లి ప్రభాకర్ రెడ్డి, టిఆర్ఎస్ మండల యువ నాయకుడు సగ్గు అంజనేయులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం రోశయ్య విగ్రహం ఆవిష్కరణ




యాదగిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : మల్లాపురం బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు గౌడ శ్రీశైలం ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పల్లె పాటి మాధవులు , మాజీ వార్డు సభ్యులు కర్రె చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి రోజునే సమైక్యవాది మాజీ ముఖ్యమంత్రి రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను మర్చిపోయే విధంగా చేయాలనే కుట్రతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు హైదరాబాదులో దొడ్డి కొమరయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పి ఇప్పటికీ ఏడాది గడుస్తున్నా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల ఆనవాళ్లు లేకుండా చేయాలనే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్వి నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఒగ్గు మల్లేష్, మండల ఉపాధ్యక్షులు మోటే శేఖర్, సోషల్ మీడియా కన్వీనర్ ఇండ్ల ప్రసాద్, ఓరుగంటి శ్రీధర్, బరిగే రాజు, గోపి, వంశీ, దాసరి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



# జూలై 9న సమ్మె కు సన్నద్ధం కావాలి

* సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కేంద్ర ప్రభుత్వం అమలు చేయడానికి సిద్ధమైన నాలుగు లేబర్ కోడ్ లను తక్షణమే రద్దు చేయాలని, ఇరవై తొమ్మిది కార్మిక చట్టాల అమలుకు సమరశీల పోరాటాలు తప్పవని,దానిలో భాగంగానే జులై 9 న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె కి కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని, ఈ పిలుపుని జిల్లా లో అత్యంత జయప్రదంగా నిర్వహించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్ అన్నారు. ఎయిర్బస్ యూనియన్ ఆధ్వర్యంలో ఓనర్లకు సమ్మె నోటీసులు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా భూక్య రమేష్ మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలోనే కార్మికులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి,కార్మిక భద్రత కి,సంక్షేమానికి అనేక పోరాటాలు చేసి కార్మిక చట్టాలను సాధించుకున్నారని అన్నారు.కార్మిక చట్టాలని కరోనా కాలంలో మోడీ ప్రభుత్వం మూజువాణి ఓటుతో పార్లమెంట్ లో మార్పులు చేసి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చారని అన్నారు. కార్పొరేట్ యాజమాన్యాలను సంతృప్తి పరచడానికి,వారి ఆదాయాలను మరింత రెట్టింపు చేయడానికి,కార్మిక వర్గం ముల్లులు పీల్చి పిప్పి చేయడానికి నాలుగు లేబర్ కోడ్ లను మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు.ఇప్పటికే దేశం లోని బిజెపి పాలిత రాష్ట్రాలలో నాలుగు లేబర్ కోడ్ లను అమలు చేస్తున్నారని,బిజెపి మిత్రుడుగా ఉన్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఏడాది పాలను పూర్తైనా సందర్భం లో కార్మికులకు ఎనిమిది గంటల పని స్థానంలో పది గంటల పని దినాన్ని అమలు చేస్తున్నారన్నారు.కాంగ్రెసు పాలిత కర్ణాటక,రాజస్థాన్ లలో నాలుగు లేబర్ కోడ్ ల అమలుకు రంగం సిద్ధమ్ చేశారన్నారు.ఏ ప్రభుత్వం అధికారం లో ఉన్నా,కార్మిక వర్గాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం తప్ప మరొకటి లేదన్నారు.కార్మిక చట్టాల పరిరక్షణ కొరకు జులై 9 న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె ని జిల్లా అన్ని రంగాల్లో అత్యంత జయప్రదంగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు వైవి రామారావు హెయిర్ బస్ యూనియన్ కార్యదర్శి కత్తి నరసింహ తదితరులు పాల్గొన్నారు.




## సార్వత్రిక సమ్మె ను జయప్రదం చేయాలి

* డివైఎఫ్ఐ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు పసుల అంజయ్య

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : జూలై 9 వ తారీఖున దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు పసుల అంజయ్య అన్నారు. జులై 9వ. తారీకు జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు భారతప్రజాతంత్ర యువజన సమాఖ్య .డివైఎఫ్ఐ. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం. ఐద్వా. కుత్బుల్లాపూర్ మండల కమిటీలు సమ్మెకు పూర్తిగా మద్దతు ప్రకటిస్తు షాపూర్ నగర్ కార్యాలయంలో సమ్మె పోస్టర్ను విడుదల చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు పసుల అంజయ్య. కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు ఆది నాగరాజు. ఐద్వా కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షురాలు రావుల స్వాతి మాట్లాడుతూ యువతీ యువకులు మహిళలు నిరుద్యోగులు అందరూ సమ్మెలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని పెట్టుబడిదారీ ప్రయోజనాల కోసం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని జులై 9న సార్వత్రిక సమ్మెను మన ప్రాంతంలో కూడా జయప్రదం చేయాలని అన్నారు కనీస వేతనం 26 వేలు అమలు చేయాలని 8 గంటల పని విధానం ఉండాలని అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవాలని కార్మిక వర్గం పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాల రద్దు వెనక్కి తీసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మండల డివైఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి ఎండి భాష యువజన సంఘం నాయకులు సాయికుమార్ బీరయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## దేశవ్యాప్త సమ్మెకు అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం మద్దతు

* ఐద్వా మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు సృజన

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ఈ నెల 9వ తారీకున నిర్వహించే దేశవ్యాప్త సమ్మెకు అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం మద్దతు తెలియజేస్తుందని ఐద్వా మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు సృజన తెలియజేశారు. అఖిల భారత కార్మిక సంఘాల సమితి పిలుపుమేరకు ఆయన పాల్గొని మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా కార్మికుల హక్కుల కోసం పోరాటం చేసి సాధించిన అనేక చట్టాలను ఎత్తివేసి ఈరోజు కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను నాలుగు కోడ్లను అమలులోకి తీసుకు వస్తున్న సందర్భంగా ఈ సమ్మె చేయడం జరుగుతుందన్నారు. ఈ కోడ్లు అమలులోకి వస్తే




ఉద్యోగ భద్రత, పించన్లు కరువవుతుందన్నారు. ఎనిమిది గంటల పని దినాలు కాస్త 12 గంటలు అవుతుంది దీనివల్ల మహిళా కార్మికుల హక్కులు తీవ్రంగా దెబ్బతింటాయన్నారు. మోడీ ప్రభుత్వం కార్మికులను కార్పోరేట్ శక్తులకు బదిలీ చేస్తుందని అన్నారు. దేశంలో సగభాగం ఉన్న మహిళలు అటు అసంఘటిత రంగంలో మరియు ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్కీం వర్కర్లుగా కాంట్రాక్ట్ కార్మికులుగా తక్కువ వేతనాలకి శ్రమ దోపిడీకి గురవుతున్నారు సమాన పనికి సమాన వేతనాలు ఎక్కడ అమలు అవడం లేదు. ఎక్కువ పని గంటల వల్ల అటు కుటుంబ వ్యవస్థ దెబ్బ తింటుంది మహిళల పైన లైంగిక దాడులు ఎక్కువ అవుతాయి కావున మహిళా కార్మికులు మహిళలు పెద్ద ఎత్తున ఈ సమ్మెలో పాల్గొని ఈ సమ్మెను జయప్రదం చేయాలని కార్మికుల పట్ల మోడీ వ్యవహరిస్తున్న మొండి వైఖరిని తక్షణమే వెనక్కి తీసుకునే లాగా మన పోరాటం ఉండాలని పిలుపునిచ్చారు.

## సుపరిపాలనలో తొలి అడుగు..
## కరపత్రాలతో ప్రజల్లోకి వెళ్లిన మంత్రి అచ్చెన్నాయుడు

* 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు
* శ్రీకాకుళం జిల్లాలో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో ముఖాముఖి
* కూటమి ప్రభుత్వ ఏడాది పాలన విజయాలను వివరించిన మంత్రి
* సూపర్ సిక్స్ హామీలను దాదాపుగా నెరవేర్చామని వెల్లడి
* రాష్ట్రానికి పరిశ్రమలను తిరిగి తీసుకువస్తున్నామని స్పష్టీకరణ

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రజల్లోకి వెళ్లారు. ప్రభుత్వం చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఆయన శ్రీకాకుళం జిల్లా, కోటబొమ్మాళి మండలంలోని చిన్న



బమ్మిడి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి స్వయంగా ఇంటింటికీ తిరుగుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. చిన్న బమ్మిడి గ్రామానికి చేరుకున్న అచ్చెన్నాయుడికి స్థానిక ప్రజలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన గ్రామంలోని ప్రతి ఇంటి గడప తొక్కుతూ, ప్రభుత్వ పనితీరును ప్రజల దృష్టికి తీసుకెళ్లారు. ఏడాది పాలనలో ప్రతి కుటుంబానికి ఏదో ఒక రూపంలో మేలు జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు తీరును, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని వారికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తమ ప్రభుత్వం దాదాపుగా నెరవేర్చిందని స్పష్టం చేశారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం విడిచి వెళ్లిపోయిన పరిశ్రమలను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషితో తిరిగి తీసుకువస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నిలబెట్టుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.




## ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలి

* కంటెస్టెడ్ కార్పొరేటర్ నర్సింగ్ యాదవ్

శేరిలింగంపల్లి,. (ప్రజాస్ఫూర్తి) : ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ మహంకాళి నగర దగ్గర ఉన్న ఎల్లమ్మ చెరువులో పెద్ద పైపులు వేసిన తరుణంలో పాత పైపులు డ్యామేజ్ అయ్యాయి. దీంతో వాటరు కాలనీలోకి ప్రవేశించడంతో ప్రజలు ఇబ్బంది పడుతూ కంటెస్టెడ్ కార్పోరేటర్ నర్సింగ్ యాదవ్ కి సమస్యను పరిష్కరించాలని కోరారు. దీంతో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న హైడ్రా అధికారులను నర్సింగ్ యాదవ్ ను కలిసి సమస్య త్వరగా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు యాదవ్, వెంకటస్వామి రెడ్డి, రాయల్, ఆశంగారి సురేష్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు

## కృష్ణాకు పెరుగుతున్న వరద ప్రవాహం ..
## శ్రీశైలం డ్యామ్ వద్ద పరిస్థితి ఇలా..

* జూరాల నుంచి శ్రీశైలం జలాశయానికి లక్షా 20వేల క్యూసెక్కుల వరద
* శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్ కు 67 వేల క్యూసెక్కుల నీరు
* శ్రీశైలంలో ప్రస్తుత నీటి మట్టం 873.90 అడుగులు




ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణా నదిలో వరద ప్రవాహం అధికమైంది. జూరాల ప్రాజెక్టు నుంచి 1 లక్షా 20 వేల క్యూసెక్కుల వరద శ్రీశైలం జలాశయానికి చేరుకుంటోంది. శ్రీశైలం నుంచి 67 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35 వేల క్యూసెక్కులు, కుడి గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 31 వేల క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పత్తి ద్వారా నాగార్జున సాగర్‌కు అధికారులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం గరిష్ఠ స్థాయి 885 అడుగులు కాగా, ప్రస్తుతం 873.90 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 172.66 టీఎంసీలకు చేరుకుంది.

## అత్యంత వైభవ పేతముగా వారాహి నవరాత్రులు

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేటలో వెలసినశ్రీ కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో గత నెల 26 నుంచి పది రోజులు వారాహి నవరాత్రులు అత్యంత వైభవ పేతముగా ప్రారంభమైనాయి ఇందులో భాగంగా శనివారం ఆఖరి రోజుగా అమ్మవారి ఆలయంలో ఆలయ ధర్మకర్త శ్రీమాన్ కొలన్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సత్యం స్వామి వారి ఆధ్వర్యంలో పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌లోని జడ్డీలకు హైకోర్టు సంచలన ఆదేశాలు!

రాష్ట్రంలోని జడ్జీలకు ఏపీ హైకోర్టు సంచలన ఆదేశాలు జారీ చేసింది. సోషల్ మీడియా పోస్టుల కేసుల్లో సుప్రీం నిర్దేశించిన సూత్రాలు పాటించడం లేదని చెప్పింది. ఆర్నేష్ కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బిహార్ తీర్పును అనుసరించాలని హైకోర్టు సూచించింది. ప్రాథమిక విచారణ లేకుండా ప్రసంగాలు, రచనలు, కళాత్మక వ్యక్తీకరణ పై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయవద్దని ఆదేశించింది. రిమాండ్‌కు




ఆదేశించే ముందు పోలీసులు చట్టాన్ని పాటించారా..లేదా... మెజిస్ట్రేట్‌లు కచ్చితంగా సర్క్యులర్ అమలు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్రంలోని జడ్జీలందరికీ హైకోర్టు రిజిస్ట్రార్ సర్క్యులర్ జారీ చేసింది.

## వీఐపీ బ్రేక్ దర్శనాలపై
## కీలక అప్ డేట్ ఇచ్చిన టీటీడీ

శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఒక ముఖ్యమైన ప్రకటన జారీ చేసింది. తిరుమల ఆలయంలో జరగనున్న ప్రత్యేక కార్యక్రమాల దృష్ట్యా రెండు రోజుల పాటు వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది. శ్రీవారి ఆలయంలో ఈ నెల 16వ తేదీన ఆణివార ఆస్థానం, దానికంటే ముందుగా 15వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం వేడుకలను నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమాల నేపథ్యంలోనే జులై 15, 16 తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు టీటీడీ స్పష్టం చేసింది. దీనికి అనుగుణంగా, భక్తుల నుంచి వచ్చే సిఫార్సు లేఖలపై కూడా టీటీడీ కీలక సూచనలు చేసింది. జులై 14, 15 తేదీలకు సంబంధించిన వీఐపీ బ్రేక్ దర్శనాల కోసం ఎలాంటి సిఫార్సు లేఖలను స్వీకరించబోమని తన ప్రకటనలో పేర్కొంది. అయితే, ప్రోటోకాల్ పరిధిలోకి వచ్చే అత్యంత ప్రముఖులకు మాత్రం ఈ నిబంధన నుంచి మినహాయింపు ఉంటుందని తెలిపింది. తిరుమల యాత్రకు ప్లాన్ చేసుకునే భక్తులు ఈ మార్పులను గమనించాలని టీటీడీ అధికారులు సూచించారు.

# రేవంత్ కు బేసిన్ లు తెలియదు... బెండకాయలు తెలియదు: కేటీఆర్

* **రైతు సమస్యలపై చర్చకు సిద్ధంగా ఉన్నామన్న కేటీఆర్**
* **సోమాజిగూడ ప్రెస్ క్లబ్ కు రావాలని సవాల్**
* **అన్నదాతకు సున్నం పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని విమర్శ**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. సాగునీటి ప్రాజెక్టులు, రైతు సమస్యలపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించిన కేటీఆర్, సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ సవాల్ విసిరారు. ఈ నెల 8వ తేదీ ఉదయం 11 గంటలకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌కు తాము వస్తామని, చర్చకు సిద్ధపడేందుకు సీఎంకు 72 గంటల సమయం ఇస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రికి బేసిన్‌ల గురించి గానీ, ప్రాజెక్టుల గురించి గానీ కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ నీళ్లు ఆంధ్రాకు, నిధులు ఢిల్లీకి తరలిపోతున్నాయని, నియామకాలు ఆయన వ్యక్తులకే దక్కుతున్నాయని ఆరోపించారు. సమైక్య రాష్ట్రంలో నీళ్ల వాటాలో అన్యాయం జరగడం వల్లే తెలంగాణ ఉద్యమం పుట్టిందని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం రైతుబంధును నాట్లు వేసే సమయంలో ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం



ఓట్లు వచ్చే ముందు రైతు భరోసా ఇస్తోందని విమర్శించారు. ఇప్పటివరకు రైతులకు ఎకరానికి 19 వేల రూపాయలు ఎగ్గొట్టి అన్నదాతకు సున్నం పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. చంద్రబాబుకు కోవర్ట్ అని ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ సమర్థించారు. ఆ ఎమ్మెల్యే చాలా కరెక్టుగా చెప్పారని, ఆయనను అభినందిస్తున్నానని పేర్కొన్నారు. తాము కల్పించిన ఉద్యోగాలను కూడా కాంగ్రెస్ తమ ఖాతాలో వేసుకుంటూ సిగ్గులేకుండా ప్రచారం చేసుకుంటోందని మండిపడ్డారు. సీఎం తన సభల్లో బూతులు మాట్లాడుతూ రంకెలు వేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. చర్చకు కేసీఆర్ అవసరం లేదని, తామే చాలని అన్నారు. మందబలంతో కాకుండా 10-15 మందితోనే ప్రెస్‌క్లబ్‌కు వస్తామని, మీడియా ముందే అన్ని విషయాలు తేల్చుకుందామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## తెలంగాణలో ఓటరు జాబితా నుంచి
# మాజీ ఎమ్మెల్యే పేరు తొలగింపు..

* **వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌కు షాక్**
* **ఓటరు జాబితా నుంచి ఆయన పేరు తొలగించిన అధికారులు**
* **భారత పౌరుడు కాదన్న హైకోర్టు తీర్పుతో ఈ చర్యలు**
* **ప్రస్తుత ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ న్యాయపోరాటం ఫలితంగా ఈ పరిణామం**
* **చెన్నమనేని ఇంటికి నోటీసులు అంటించిన ఎన్నికల సిబ్బంది**
* **నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నేత ఓటు హక్కు కోల్పోవడంపై చర్చ**

తెలంగాణ రాజకీయాల్లో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. వేములవాడ నియోజకవర్గం నుంచి నాలుగు పర్యాయాలు శాసనసభ్యుడిగా ప్రాతినిధ్యం వహించిన చెన్నమనేని రమేష్ తన ఓటు హక్కును కోల్పోయారు. ఆయన భారత పౌరుడు కాదని ఇటీవల హైకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో అధికారులు ఆయన పేరును వేములవాడ ఓటరు జాబితా నుంచి తొలగించారు. ఈ మేరకు ఎన్నికల అధికారులు చెన్నమనేని రమేష్ నివాసానికి నోటీసులు అంటించారు. ఆయన పౌరసత్వం చెల్లదని, అందువల్ల ఓటరుగా కొనసాగే అర్హత లేదని ఆ నోటీసులో పేర్కొన్నారు. దీనిపై చెన్నమనేని వైపు నుంచి



సమాధానం రావాల్సి ఉంది. ఓటరు జాబితాలో పేరు తొలగింపుపై గతంలో అధికారులు నోటీసులు జారీ చేశారు. సమాధానం రాకపోవడంతో ఓటరు జాబితా నుంచి ఆయన పేరును తొలగించారు. చెన్నమనేని పౌరసత్వంపై ప్రస్తుత వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సుదీర్ఘకాలంగా న్యాయపోరాటం చేసిన విషయం విదితమే. ఈ పోరాటం ఫలితంగానే హైకోర్టు తీర్పు వెలువడింది. కోర్టు తీర్పును తక్షణమే అమలు చేయాలని, ఓటరు జాబితా నుంచి చెన్నమనేని పేరును తొలగించాలని ఆది శ్రీనివాస్ అధికారులను కోరారు. ఆయన విజ్ఞప్తి మేరకు అధికారులు ఈ చర్యలు చేపట్టారు. ఒక రాష్ట్రంలో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన వ్యక్తి, పౌరసత్వ వివాదం కారణంగా ఓటు హక్కును కోల్పోవడం బహుశా దేశంలోనే ఇదే తొలిసారి అంటూ రాజకీయ వర్గాల్లో చర్చించుకుంటున్నారు.

## ఉత్తర కుమారుడి ప్రగల్భాలు ఆపండి..
# కేటీఆర్‌పై చామల కిరణ్ కుమార్ రెడ్డి ఫైర్

* **రైతు రాజ్యంపై చర్చకు రావాలని కేసీఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్**
* **కేసీఆర్ బదులు తానే వస్తానంటూ స్పందించిన కేటీఆర్**
* **కేటీఆర్ వ్యాఖ్యలపై భువనగిరి కాంగ్రెస్ ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర విమర్శలు**
* **కేటీఆర్‌వి ఉత్తర కుమారుడి ప్రగల్భాలంటూఎద్దేవా**
* **ముందు ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను అసెంబ్లీకి తీసుకురావాలని డిమాండ్**

తెలంగాణలో రైతు రాజ్యం ఎవరి వల్ల సాధ్యమైందో తేల్చుకుందామంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌పై బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి



చేరింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. కేటీఆర్ ఇకనైనా ఉత్తర కుమారుడి ప్రగల్భాలు ఆపాలని, ఆయనకు సవాళ్లు అచ్చిరావని ఎద్దేవా చేశారు. గతంలో కూడా కేటీఆర్ ఇలాగే సవాళ్లు విసిరి తప్పించుకున్న సందర్భాలు చాలా ఉన్నాయని కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రభుత్వాన్ని సవాల్ చేసే స్థాయి, అర్హత కేటీఆర్‌కు లేవని ఆయన మండిపడ్డారు. ముందుగా, ప్రతిపక్ష నేత హోదాలో ఉండి కూడా అసెంబ్లీకి రాని తన తండ్రి కేసీఆర్‌ను ఫామ్‌హౌస్ నుంచి శాసనసభకు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాతే చర్చల గురించి మాట్లాడాలని హితవు పలికారు. అంతేకాకుండా, కేటీఆర్‌కు అంతగా ఆసక్తి ఉంటే తండ్రిని బతిమాలి ప్రతిపక్ష నేత హోదాను తాను తీసుకుని, ఆ తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చకు రావాలని సూచించారు. అలా కాకుండా పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతూ తొడలు కొడితే ప్రజలు నవ్వుకుంటారని చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు.

# మీ ఇంటి ముందు ఇలా ఉంటే నిమిషమైనా ఉండగలరా?
## : జీహెచ్ఎంసీ కమిషనర్‌పై కిషన్ రెడ్డి ఆగ్రహం

* **హైదరాబాద్‌లోని శ్రీకృష్ణనగర్ బస్తీలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పర్యటన**
* **ఇళ్ల ముందు పారుతున్న మురుగునీటిపై స్థానికుల ఆవేదన**
* **అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కిషన్ రెడ్డి**
* **జీహెచ్ఎంసీ కమిషనర్‌పై ఫోన్‌లోనే ఆగ్రహం**
* **వారం రోజుల్లో సమస్యను పరిష్కరించాలని ఆదేశం**

హైదరాబాద్ నగరంలోని ఓ బస్తీలో నెలకొన్న దుస్థితిపై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంపై తీవ్రస్థాయిలో మండిపడిన ఆయన, జీహెచ్ఎంసీ కమిషనర్‌పై ఫోన్‌లోనే ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లోగా సమస్యను పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని శ్రీకృష్ణనగర్ బస్తీలో కిషన్ రెడ్డి శనివారం నాడు పర్యటించారు. ఈ సందర్భంగా సీ బ్లాక్‌లోని కమ్యూనిటీ హాల్ వద్ద ఇళ్ల ముందు మురుగునీరు ఏరులై పారుతుండటాన్ని గమనించారు. రోజుల తరబడి ఇదే పరిస్థితి కొనసాగుతోందని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆయన ఎదుట వాపోయారు. ప్రజల ఇబ్బందులను చూసి చలించిపోయిన కిషన్ రెడ్డి, అక్కడి నుంచే జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఫోన్ చేశారు. "మీ ఇంటి ముందు ఇలా మురుగునీరు



ప్రవహిస్తుంటే ఒక్క నిమిషమైనా ఉండగలరా?" అని తీవ్ర స్వరంతో ప్రశ్నించారు. అధికారుల తీరు ఏమాత్రం బాగోలేదని అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే చర్యలు చేపట్టి, వారం రోజుల్లోగా ఈ మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గడువు విధించారు.

# సీతక్కకు బెదిరింపు లేఖ..
## మావోయిస్టుల కొత్త ట్విస్ట్!

* **మంత్రి సీతక్కకు బెదిరింపు లేఖపై తీవ్ర దుమారం**
* **వారం క్రితం వైరల్ అయిన మావోయిస్టుల పేరిట లేఖ**
* **తాజాగా తెరపైకి వచ్చిన మరో సంచలన లేఖ**
* **ఆ లేఖ తాము రాయలేదని స్పష్టం చేసిన మావోయిస్టు పార్టీ**

రాష్ట్ర మంత్రి సీతక్కను హెచ్చరిస్తూ కొన్ని రోజుల క్రితం విడుదలైన మావోయిస్టుల లేఖ తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపిన విషయం విదితమే. అయితే, ఈ వ్యవహారంలో తాజాగా కీలక మలుపు చోటుచేసుకుంది. ఆ లేఖను తాము విడుదల చేయలేదని మావోయిస్టు పార్టీయే స్వయంగా ప్రకటించింది. వారం క్రితం మంత్రి సీతక్కను హెచ్చరిస్తూ మావోయిస్టుల పేరుతో ఒక లేఖ వెలుగులోకి వచ్చింది. ఇది మీడియాలో, సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా ప్రచారమైంది. ఈ పరిణామంతో



రాజకీయ వర్గాల్లోనూ ఆందోళన వ్యక్తమైంది. అయితే, ఈ లేఖపై మొదటి నుంచి కొన్ని సందేహాలు వ్యక్తమవుతున్న తరుణంలో మావోయిస్టు పార్టీయే దీనిపై స్పష్టత ఇచ్చింది. సీతక్కను ఉద్దేశించి తాము ఎలాంటి లేఖ రాయలేదని తేల్చిచెబుతూ మావోయిస్టు పార్టీ తాజాగా ప్రకటన విడుదల చేసింది. మావోయిస్టు పార్టీయే స్వయంగా ఖండించడంతో ఆ మొదటి లేఖను ఎవరు సృష్టించారు? వారి ఉద్దేశం ఏంటి? అనే దానిపై చర్చ జరుగుతోంది.

## తెలంగాణ బీజేపీ నూతన అధ్యక్షుడిగా
# రామచందర్‌రావు బాధ్యతల స్వీకరణ

* **తెలంగాణ బీజేపీ పగ్గాలు చేపట్టిన ఎన్. రామచందర్‌రావు**
* **హాజరైన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ**
* **గజమాలతో రామచందర్‌రావుకు ఘన సత్కారం**
* **బాధ్యతల స్వీకరణకు ముందు ఆలయాల్లో ప్రత్యేక పూజలు**

బీజేపీ తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా సీనియర్ నేత ఎన్. రామ చందర్‌రావు శనివారం బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, ఎంపీ డీకే అరుణతో పాటు పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ



సందర్భంగా నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపిన నేతలు, ఆయన్ను గజమాలతో ఘనంగా సత్కరించారు. అంతకు ముందు రామచందర్‌రావు తన నివాసం నుంచి పార్టీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా బయలుదేరారు. అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించే ముందు ఆయన ఉస్మానియా విశ్వ విద్యాలయంలోని సరస్వతీ దేవి ఆలయంలో, చారిత్రక చార్మినార్ వద్ద ఉన్న భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవార్ల ఆశీర్వాదం తీసుకున్నారు.


# వాణిజ్య కేంద్రాల్లో పని గంటలు..
## తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు

* **ఉద్యోగుల పని వేళల పరిమితిని సవరించిన ప్రభుత్వం**
* **రోజుకు 10 గంటల వరకు పని చేసేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు**
* **వారంలో పని వేళలు 48 గంటలకు మించరాదని ఉత్తర్వులు**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వాణిజ్య కేంద్రాలలో పనిచేసే ఉద్యోగుల పని వేళల పరిమితిని సవరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై రోజుకు 10 గంటల వరకు పని చేసేందుకు అనుమతిచ్చింది. అయితే, వారంలో పని వేళలు 48 గంటలకు మించరాదని స్పష్టం చేసింది. పరిమితి దాటితే మాత్రం ఓటీ వేతనం చెల్లించాలని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొంది. రోజులో ఆరు గంటల పనివేళల్లో కనీసం అరగంట విరామం ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. విరామంతో కలిపి రోజుకు 12 గంటల కంటే ఎక్కువ పని చేయించరాదని ఆదేశించింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా పని వేళలను సవరించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

# ఆసుపత్రి నుంచి మాజీ సీఎం కేసీఆర్ డిశ్చార్జ

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అనారోగ్యం నుంచి పూర్తిగా కోలుకున్నారు. గురువారం సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో చేరిన ఆయన, ఈ రోజు సంపూర్ణ ఆరోగ్యంతో డిశ్చార్జ్ అయ్యారు. అనంతరం ఆయన నేరుగా నందినగర్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. ఈ నెల 3వ తేదీన జ్వరంతో పాటు రక్తంలో చక్కెర స్థాయిలు గణనీయంగా పెరగడం, సోడియం స్థాయిలు పడిపోవడంతో కేసీఆర్‌ను కుటుంబసభ్యులు హుటాహుటిన యశోద ఆసుపత్రిలో చేర్పించిన విషయం తెలిసిందే. ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో ఆయనకు చికిత్స అందించారు. ప్రస్తుతం కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి పూర్తిగా నిలకడగా ఉందని యశోద ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఆయన రక్తంలో చక్కెర, సోడియం స్థాయిలు సాధారణ స్థితికి చేరాయని స్పష్టం చేశారు. జ్వరం కూడా తగ్గడంతో నిన్నటి నుంచే ఆయన ఉత్సాహంగా ఉన్నారని,



పార్టీ నేతలతో కూడా మాట్లాడారని తెలిసింది. ఆరోగ్యం పూర్తిగా కుదుటపడటంతో ఆయన్ను డిశ్చార్జ్ చేసేందుకు వైద్యులు అనుమతించారు.

# సీఎం కలిపారన్న ఉద్ధవ్, రాజ్ ధాకరే.. క్రెడిట్ ఇచ్చినందుకు ఫడ్నవీస్ థ్యాంక్స్!

* దాదాపు 20 ఏళ్ల తర్వాత ఒకే వేదికపైకి ఉద్ధవ్, రాజ్ ధాకరే
* మరాఠీ భాషా పరిరక్షణ కోసం ముంబైలో ఉమ్మడి నిరసన
* మమ్మల్ని కలిపినందుకు ఫడ్నవిస్‌కు ధన్యవాదాలన్న రాజ్ ధాకరే
* అధికారం కోల్పోయిన నిరాశతో ఉద్ధవ్ మాట్లాడుతున్నారన్న ఫడ్నవిస్



మహారాష్ట్ర రాజకీయాల్లో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. దశాబ్దాలుగా రాజకీయంగా దూరంగా ఉంటున్న అన్నదమ్ములు, శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ధాకరే, మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) చీఫ్ రాజ్ ధాకరే శనివారం ముంబైలో ఒకే వేదికను పంచుకున్నారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత వీరిద్దరూ కలిసి ఒక కార్యక్రమంలో పాల్గొనడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో హిందీని ప్రవేశపెట్టాలన్న నిర్ణయానికి వ్యతిరేకంగా మరాఠీ భాషా పరిరక్షణ కోసం నిర్వహించిన సభలో ఠాక్రే సోదరులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాజ్ ధాకరే... ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "మా నాన్న బాల్ ధాకరే సైతం చేయలేని పనిని ఫడ్నవిస్ చేసి చూపించారు. రాష్ట్రానికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకుని, మమ్మల్నిద్దరినీ ఒక్కటి చేశారు" అని వ్యాఖ్యానించారు. ఇదే కార్యక్రమంలో ఉద్ధవ్ ధాకరే సైతం ప్రభుత్వ తీరుపై ఘాటుగా స్పందించారు. "అవును, మేము గూండాలమే. మరాఠీ ప్రజలకు న్యాయం జరగాలంటే గూండాయిజం చేయాల్సి వస్తే, అది కూడా చేస్తాం. మరాఠీ పరిరక్షణ మాకు గర్వకారణం" అని అన్నారు. ప్రభుత్వానికి శాసనసభలో బలం ఉంటే తమకు వీధుల్లో బలం ఉందని రాజ్ ధాకరే హెచ్చరించారు. ధాకరే సోదరుల వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి ఫడ్నవిస్ స్పందించారు. వారి కలయిక క్రెడిట్ తనకు ఇచ్చినందుకు వారికి ధన్యవాదాలు తెలుపుతూనే, ఉద్ధవ్‌పై విమర్శలు గుప్పించారు. "అధికారం కోల్పోయిన నిరాశతోనే ఉద్ధవ్ రాజకీయాలు మాట్లాడుతున్నారు. 25 ఏళ్లు బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్‌ను పాలించి ముంబైకి చేసిందేమీ లేదు. మేము నగరాన్ని అభివృద్ధి చేస్తున్నాం" అని ఫడ్నవిస్ కౌంటర్ ఇచ్చారు.

# మరో 30-40 ఏళ్లు జీవించాలని ఆశగా ఉంది



టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా వారసుడి ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని..ఆయన ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన తన మనసులోని మరో విషయాన్ని బయటపెట్టారు. జులై 6న తన 90వ పుట్టిన రోజు వేడుక నిర్వహించుకోనున్న నేపథ్యంలో.. ఆయన అనుచరులు దలైలామా దీర్ఘాయుష్షు కోసం పలు ప్రార్థనలు నిర్వహించారు. అందులోభాగంగా టిబెట్ బౌద్ధమత గురువు మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేస్తూ మరో 30 40 ఏళ్లు జీవించాలని ఉందనే తన ఆకాంక్షను వ్యక్తంచేశారు. మరికొన్నేళ్లు ఆరోగ్యంగా జీవించగలననే దేవుని స్పష్టమైన సంకేతాలు తనకు అందుతున్నాయన్నారు. బుద్ధుని బోధనల వ్యాప్తికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. గతంలోనూ దలైలామా తన ఆయుష్షు గురించి మాట్లాడుతూ..తాను 110 ఏళ్లు జీవిస్తానని ఓ కల వచ్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం తనకు 90 ఏళ్లు నిండటంతో 15వ దలైలామా ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని.. దానిని నిర్వహించే అధికారం గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్ట్‌కు మాత్రమే ఉందని ఇటీవల టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా తేల్చిచెప్పారు. ఈమేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. 2011 సెప్టెంబర్ 24నే తాను టిబెట్ బౌద్ధ మత పెద్దలు, నాయకులు, ఇతర సంస్థలతో భేటీ నిర్వహించి.. తన వారసుడి ఎంపిక కొనసాగించాలా..?అనేఅంశంపైఅభిప్రాయాలు కోరినట్లు పేర్కొన్నారు. దీనికి అన్నివర్గాల నుంచి సానుకూల స్పందనలు వచ్చాయన్నారు. ఈ విషయంలో జోక్యం చేసుకొనే అధికారం ఎవరికీ లేదని చైనాను ఉద్దేశించి అన్నారు. కాగా.. టిబెట్‌పై పట్టు కోసం భవిష్యత్తులో దలైలామా స్థానాన్ని కబ్జా చేయాలని చైనా భావిస్తోంది. ఆ స్థానం ఎంపికలో పంచయిన్ లామా పాత్ర చాలా కీలకం. టిబెట్‌లోనే ఉండిపోయిన పంచయిన్ లామా 1989లో అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఆయనపై విష ప్రయోగం చేశారంటారు. పంచయిన్ లామా వారసుడిగా ఎంపికైన బాలుడిని తన అధీనంలో ఉంచుకొన్నట్లు కొన్నేళ్ల కిందట బీజింగ్ ప్రకటించింది. ఈ ఎత్తుగడలను గ్రహించిన దలైలామా తన పునర్జన్మ టిబెట్ బయట కూడా జరగొచ్చని ప్రకటించారు. దీంతోపాటు వారసుడిని (పునర్జన్మ పొందిన బాలుడిని) ఎంపిక చేసే ప్రక్రియ కూడా తమదేనని తేల్చిచెప్పారు.

# యూపీలో ఘోరం..
# ప్రియుడితో కలిసి భర్త, పిల్లల హత్యకు భార్య కుట్ర

* ప్రియుడితో కలిసి భర్త, ఇద్దరు పిల్లల హత్యకు భార్య స్కెచ్
* ముందుగా పాలలో విషం కలిపి చంపేందుకు విఫలయత్నం
* నిద్రిస్తున్న భర్తపై కత్తితో దాడికి తెగబడిన భార్య, ప్రియుడు
* తృటిలో ప్రాణాలతో బయటపడి పోలీసులకు ఫిర్యాదు చేసిన భర్త
* భార్య నైనా, ఆమె ప్రియుడు ఆశిష్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు
* ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ జిల్లాలో వెలుగుచూసిన దారుణం



వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న ఓ మహిళ తన భర్తను, కన్నబిడ్డలను అడ్డు తొలగించుకోవాలని ప్రియుడితో కలిసి దారుణానికి ఒడిగట్టింది. మొదట విషప్రయోగం చేసి, అది ఫలించకపోవడంతో నిద్రిస్తున్న భర్తపై కత్తితో దాడికి పాల్పడింది. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ జిల్లాలో తీవ్ర కలకలం రేపింది. సంభాల్ జిల్లా బహ్జోయ్ ప్రాంతానికి చెందిన గోపాల్ మిశ్రా, నైనా శర్మ దంపతులకు నాలుగేళ్ల చిరాగ్, ఏడాదిన్నర వయసున్న కృష్ణ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే నైనా శర్మ అదే ప్రాంతానికి చెందిన ఆశిష్ మిశ్రాతో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. తమ బంధానికి అడ్డుగా ఉన్న భర్త, పిల్లలను హత్య చేయాలని ప్రియుడితో కలిసి కుట్ర పన్నింది. పథకం ప్రకారం జూన్ 30న నైనా పాలలో విషం కలిపి భర్త గోపాల్‌కు, ఇద్దరు పిల్లలకు ఇచ్చింది. అయితే ఆ ప్రయత్నం విఫలమైంది. దీంతో జూలై 2వ తేదీ అర్ధరాత్రి, ఇంట్లో నిద్రిస్తున్న గోపాల్‌పై నైనా, ఆమె ప్రియుడు ఆశిష్ కత్తితో దాడి చేసి హత్య చేసేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన గోపాల్ వారి నుంచి తృటిలో తప్పించుకుని, ఇంటి నుంచి బయటకు పరుగెత్తి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్నారు. దీంతో భయపడిన నైనా, ఆశిష్ ఘటనా స్థలం నుంచి పరారయ్యారు. అనంతరం గోపాల్ మిశ్రా నేరుగా పోలీసులను ఆశ్రయించాడు. తన భార్య నైనాకు ఆశిష్‌తో ఉన్న వివాహేతర సంబంధం గురించీ, వారిద్దరూ కలిసి తనను, తన పిల్లలను చంపేందుకు రెండుసార్లు ప్రయత్నించిన తీరును ఫిర్యాదులో వివరించాడు. ఈ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు, పరారీలో ఉన్న నైనా శర్మ, ఆశిష్ మిశ్రాలను జూలై 4న అరెస్ట్ చేసినట్లు ఓ పోలీస్ అధికారి తెలిపారు. ప్రస్తుతం ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని ఆయన వెల్లడించారు.

# ముంబైలో ఇన్వెస్టర్ కార్యాలయంపై రాజ్ ధాకరే పార్టీ కార్యకర్తల దాడి.. సోషల్ మీడియా పోస్టే కారణం

* మరాఠీ భాషపై రాజ్ ధాకరేను సవాల్ చేసిన ఇన్వెస్టర్ సుశీల్ కేడియా
* మరాఠీ నేర్చుకోనంటూ 'ఎక్స్'లో వివాదాస్పద పోస్ట్
* ఆగ్రహంతో ముంబైలోని కేడియా ఆఫీసుపై ఎంఎన్ఎస్ కార్యకర్తల దాడి
* వెంటనే దిగొచ్చి క్షమాపణలు చెప్పి, ట్వీట్ తొలగించిన కేడియా
* రాజ్ ధాకరేకు తాను వీరాభిమానినంటూ వ్యాఖ్యలు



మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) అధినేత రాజ్ ధాకరేకు సామాజిక మాధ్యమం వేదికగా సవాల్ విసిరిన ఒక ఇన్వెస్టర్, ఆ తర్వాత పరిణామాలతో వెనక్కి తగ్గారు. తన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పడమే కాకుండా, తాను రాజ్ ధాకరేకు వీరాభిమానినని ప్రకటించారు. ఈ ఘటన ముంబైలో చర్చనీయాంశంగా మారింది. మహారాష్ట్రలో నివసించే ప్రతి ఒక్కరూ మరాఠీ భాష నేర్చుకోవాలని రాజ్ ధాకరే చేసిన వ్యాఖ్యలపై ఇన్వెస్టర్ సుశీల్ కేడియా 'ఎక్స్'లో స్పందిస్తూ, "నేను 30 ఏళ్లుగా ముంబైలోనే ఉంటున్నాను, కానీ నాకు మరాఠీ సరిగా రాదు. మరాఠీ నేర్చుకునే ఉద్దేశం కూడా లేదు. ఏం చేస్తారో చెప్పండి?" అంటూ ఆయన సవాల్ విసిరారు. ఈ పోస్ట్ క్షణాల్లో వైరల్ కావడంతో ఎంఎన్ఎస్ కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం కొందరు ఎంఎన్ఎస్ కార్యకర్తలు ముంబైలోని సుశీల్ కేడియా కార్యాలయానికి చేరుకుని రాళ్ల దాడికి పాల్పడ్డారు. రాజ్ ధాకరేకు, మరాఠీ భాషకు మద్దతుగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ దాడి జరిగిన కొద్దిసేపటికే సుశీల్ కేడియా తన వివాదాస్పద ట్వీట్‌ను తొలగించి, క్షమాపణలు కోరారు. "మానసిక ఒత్తిడి కారణంగానే ఆ విధంగా స్పందించాను. మరాఠీ రాదన్న కారణంతో జరుగుతున్న హింసాత్మక ఘటనలు చూసి ఆవేశానికి లోనయ్యాను" అని కేడియా వివరణ ఇచ్చారు. రాజ్ ధాకరే ఎన్నో కీలక అంశాలను ప్రస్తావిస్తారని, ప్రజల సమస్యలపై నిలబడే సత్తా ఆయనకు ఉందని ప్రశంసించారు. తాను ఆయనకు వీరాభిమానినని పేర్కొన్నారు. గతంలో థానేలో మరాఠీ మాట్లాడలేదని ఒక దుకాణదారుడిపై జరిగిన దాడిని కూడా కేడియా ఖండించారు.





# ట్రంప్ సుంకాలకు మోదీ తలొగ్గుతారు.. రాసి పెట్టుకోండి

మూడు నెలల క్రితం భారత్‌పై 26 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. 90 రోజుల విరామం తర్వాత అది అమల్లోకి రాకుండా ఉండేందుకు వాణిజ్య ఒప్పందం చేసుకోవడానికి భారత్ ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ గుండెలు బాదుకోవడం తప్ప చేసేదేమీ ఉండదని రాహుల్ పేర్కొన్నారు. ట్రంప్ సుంకాలకు ప్రధాని మోదీ తలొగ్గుతారని.. తన మాటలు నమ్మకపోతే రాసిపెట్టుకోవాలని వ్యాఖ్యానించారు. అమెరికా పరస్పర సుంకాల సస్పెన్షన్ జులై 9న ముగియనున్నందున, ఆ గడువుకు ముందే చర్చలు పూర్తి చేయాలని ఇరుదేశాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్‌గోయల్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల విషయంలో భారత్ పటిష్ఠ విధానాలను కలిగిఉందని స్పష్టం చేశారు. గడువు ఆధారంగా కీలకమైన వాణిజ్య ఒప్పందాలను ఖరారు చేసుకునేందుకు దేశం ఎప్పుడూ తొందరపడదని అన్నారు. రెండు వర్గాలకు లాభదాయకంగా ఉంటేనే అంగీకరిస్తుందన్నారు. అమెరికాతో కుదుర్చుకోనున్న ఒప్పందంలో భాగంగా భారత్ కొన్ని కీలక రంగాల్లో సుంకాల నుంచి అగ్రరాజ్యాన్ని సడలింపు కోరుతోంది. ఇందులో టెక్స్‌టైల్స్, రత్నాలు, ఆభరణాలు, దుస్తులు, ప్లాస్టిక్స్, రసాయనాలు, రొయ్యలు, నూనె గింజలు, ద్రాక్ష, అరటిపండ్లు వంటివి ఉన్నాయి. మరోవైపు అమెరికా కొన్ని పారిశ్రామిక వస్తువులు, ఆటోమొబైల్స్ (ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాలు), వైన్స్, పెట్రో కెమికల్ ఉత్పత్తులు, పాడి ఉత్పత్తులు రంగాల్లో సుంకాల సడలింపు కోరుతోంది. అయితే ఈ సడలింపులను ఆమోదిస్తే, మన దేశంలో రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయనే ఆందోళన ఉంది. ఇది రాజకీయంగా సున్నిత అంశమైనందున, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకం మినహాయింపులకు భారత్ ససేమిరా అంటోంది. వాణిజ్య చర్చల నిమిత్తం ఇటీవల అమెరికా వెళ్లిన భారత బృందం తిరిగివచ్చింది. దీంతో అమెరికాభారత్ మధ్య ఈనెల 9లోగా మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# రాబోయే రెండేళ్లలో రూ.1.40 లక్షల కోట్లకు టోల్ వసూళ్లు: గడ్కరీ



దేశంలో పేదల సంఖ్య పెరుగుతోందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన వ్యక్తం చేశారు. సంపదంతా కొంతమంది సంపన్నుల చేతుల్లో పోగుపడుతోందన్నారు. నాగ్‌పూర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సంపద వికేంద్రీకరణ అవసరమని పేర్కొన్నారు. ఉదారవాద ఆర్థిక విధానాలను అవలంబించారంటూ మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్‌లను కొనియాడారు. ''దేశంలో పేదల సంఖ్య పెరుగుతోంది. సంపద కొంతమంది సంపన్నుల చేతుల్లో కేంద్రీకృతమవుతోంది. ఇలా జరగకూడదు. ఉద్యోగాలు సృష్టించే, గ్రామీణ ప్రాంతాలను వికాసం వైపు నడిపించే విధంగా ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందాలి. దీనికి సంబంధించిన అవకాశాలను పరిశీలిస్తున్నాం. సంపద వికేంద్రీకరణ దిశగా కూడా అనేక మార్పులు జరిగాయి'' అని గడ్కరీ తెలిపారు. జీడీపీకి రంగాల వారీ సహకారంలో అసమతుల్యాన్ని ప్రస్తావిస్తూ.. ''జీడీపీలో తయారీ రంగం 22-24 శాతం, సేవల రంగం 52-54 శాతం వాటా కలిగి ఉన్నాయి. గ్రామీణ జనాభాలో 65-70 శాతం మంది భాగస్వామ్యమైనప్పటికీ.. వ్యవసాయ రంగం నుంచి 12 శాతం మాత్రమే వస్తోంది'' అని చెప్పారు. ''రోడ్ల నిర్మాణం కోసం 'బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్' విధానాన్ని ప్రారంభించినది నేనే. రహదారుల అభివృద్ధికి నిధుల కొరత లేదు. టోల్ బూత్‌ల ద్వారా ప్రస్తుతం ఏటా దాదాపు రూ.55 వేల కోట్ల ఆదాయం వస్తోంది. రాబోయే రెండేళ్లలో ఇది రూ.1.40 లక్షల కోట్లకు పెరుగుతుంది. 15 ఏళ్లలో రూ.12 లక్షల కోట్లకు చేరుకుంటుంది'' అని తెలిపారు. ''నిధుల విషయంలో విదేశీ సాయం లేకుండా 'ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్)' బాండ్ల ద్వారా సేకరణ చేపట్టాం. దేశ ప్రజల నుంచి సేకరించిన డబ్బుతో రోడ్లు నిర్మిస్తున్నాం. రూ.100 ఉన్న షేర్ విలువ ఇప్పుడు రూ.160కి పెరిగింది'' అని వెల్లడించారు.



# టేకాఫ్‌కు ముందు ఫైర్ అలర్ట్.. కిందకు దూకిన ప్రయాణికులు!

ఓ విమానం టేకాఫ్ అవుతున్న సమయంలోనే ఫైర్ అలర్ట్ రావడం కలకలం రేపింది. దాంతో అందులోని ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ప్రాణభయంతో పరుగులు తీస్తూ ఎమర్జెన్సీ ద్వారాల్లో బయటకు దిగే ప్రయత్నం చేశారు. కొందరు విమానం రెక్కపై నుంచి కిందికి దూకేశారు. ఈ క్రమంలో పలువురికి గాయాలైన ఘటన స్పెయిన్‌లో చోటుచేసుకుంది. స్పెయిన్‌లోని పాల్మా డె మేయర్క్ విమానాశ్రయం నుంచి ర్యాన్‌ఎయిర్‌కు చెందిన బోయింగ్ 737 విమానం మాంచెస్టర్ వెళ్లేందుకు సిద్ధమైంది. టేకాఫ్ సమయంలోనే అందులో ఫైర్ అలర్ట్ వచ్చింది. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే అక్కడకు చేరుకున్న అగ్నిమాపక, పోలీసు బృందాలు.. ప్రయాణికులను అత్యవసర ద్వారాల ద్వారా బయటకు పంపే చర్యలు చేపట్టాయి. అదే సమయంలో కొందరు ప్రయాణికులు మాత్రం రెక్కలపై నుంచి కిందికి దూకారు. ఎమర్జెన్సీ ఎగ్జిట్ ఉందని విమాన సిబ్బంది చెబుతున్నప్పటికీ భయంతో కిందకు దూకేయడంతో దాదాపు 18 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలను ఓ మీడియా సంస్థ షేర్ చేయడంతో అవి వైరల్‌గా మారాయి. ఈ వ్యవహారంపై సదరు విమానయాన సంస్థ స్పందించింది. ఫైర్ అలర్ట్ వచ్చిన వెంటనే స్పందించి ప్రయాణికులను టెర్మినల్‌కు తరలించామని తెలిపింది.



## హీరో సుహాస్ 'ఓ భామ అయ్యో రామ'

# ట్రైలర్ విడుదల

### సినిమా సినిమాకు డిఫరెంట్ కథలను ఎంచుకుంటూ దూసుకెళ్తుతున్న కథానాయకుడు సుహాస్

**టాకీస్:** సినిమా సినిమాకు డిఫరెంట్ కథలను ఎంచుకుంటూ దూసుకెళ్తుతున్న కథానాయకుడు సుహాస్ తాజాగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'ఓ భామ అయ్యో రామ'. మలయాళంలో జో అనే చిత్రంతో అందరి హృదయాలను దోచుకున్న నటి మాళవిక మనోజ్ (జో ఫేమ్) ఈ చిత్రంతో తెలుగులో కథానాయికగా పరిచయమవుతోంది. రామ్ గోధల దర్శకుడు. వీ ఆర్ట్స్ పతాకంపై హరీష్ నల్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జూలై 11న చిత్రం ప్రపంచ వ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ కానుంది. కాగా ఈ చిత్రం ట్రైలర్‌ను శనివారం విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్‌ను గమనిస్తే.. ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్, హీరో, హీరోయిన్స్ ఎనర్జీ, ఇలా ఈతరం ప్రేక్షకులతో పాటు అన్ని వర్గాల వారిని అలరించే ఫుల్ ప్యాకేజీగా ఈ చిత్రాన్ని రూపొందించారని అర్థమవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ " ట్రైలర్ విడుదలైన కొద్ది సమయంలోనే మంచి స్పందన వస్తోంది. ట్రైలర్ చూసిన వారు ఈచిత్రం షూర్ షాట్ విజయం అంటుంటే ఆనందంగా ఉంది.

క్యూట్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ప్రత సన్నివేశం ఆడియన్స్‌ను ఎంటర్‌టైన్ చేస్తుంది. హీరో సుహాస్, మాళవిక మధ్య వచ్చే లవ్ సీన్స్ కూడా అలరించే విధంగా ఉంటాయి. సుహాస్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న చిత్రమిది. తప్పకుండా ఈ చిత్రం అందరికి కొత్త అనుభూతినిస్తుంది. జూలై 11న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. పూర్తి ఎంటర్‌టైనింగ్‌గా రాబోతున్న ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ మీ హృదయాలను దోచుకుంటుంది.

తప్పకుండా నిర్మాతగా ఓ మంచి సినిమాను ఇవ్వబోతున్నాం అనే నమ్మకం ఉంది అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ ఇటీవల విడుదలైన ప్రతి ప్రమోషన్ కంటెంట్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఓ క్వాలిటీ సినిమాను ప్రేక్షకులకు ఇవ్వడానికి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మాత హరీష్ ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీపడకుండా సినిమాను నిర్మించాడు. ప్రొడక్ట్ క్వాలిటీగా రావడానికి ఆయనే కారణం. మణికందన్ ఫోటోగ్రఫీతో ఈ సినిమాను చాలా కలర్‌ఫుల్‌గా మలిచాడు. రథన్ ఈ లవ్‌స్టోరీకి చాలా మంచి సంగీతాన్ని అందించాడు. ఈ సినిమాలో ఉన్న ఆరుపాటలు వేటికవే అనే విధంగా బ్యూటిఫుల్‌గా ఉంటాయి అన్నారు.

ఈ చిత్రంలో ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ అతిథి పాత్రలో కనిపించబోతున్నాడు. మణికందన్ సినిమాటోగ్రఫీని అందిస్తున్న ఈ చిత్రానికి రథన్ సంగీతాన్నిసమాకూరుస్తున్నాడు. బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు



# కన్నప్ప హీరోయిన్‌ను వరించిన బంపర్ ఆఫర్

## స్టార్ హీరో సినిమాలో ఛాన్స్

## Preety Mukhundhan


టాకీస్: టాలీవుడ్‌ను కొత్త అందాలు పలకరిస్తున్నాయి. అలా టాలీవుడ్ కు పరిచయమైన భామే ప్రీతి ముకుందన్. ఈ చిన్నది ఇటీవలే టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు పాన్ ఇండియా సినిమాలో నటించి మంచి విజయాన్ని అందుకుంది అందాల భామ. ఇప్పుడు కన్నప్ప సినిమాతో మరోసారి ప్రేక్షకులను కవ్వించింది ప్రీతి ముకుందన్. మంచు విష్ణు హీరోగా నటించిన కన్నప్ప సినిమా పాన్ ఇండియా మూవీగా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది ఈ ముద్దుగుమ్మ. కన్నప్ప సినిమాలో నెమలి పాత్రలో ప్రీతి ముకుందన్ నటించి ఆకట్టుకుంది. ప్రీతి ముకుందన్ టీవీ షోలో నృత్య ప్రదర్శనలలో తన కెరీర్ ను ప్రారంభించింది.ప్రీతి ముకుందన్ మొదటి మ్యూజిక్ ఆల్బమ్ 'ముత్తు ము2' యూట్యూబ్ లో 4.2 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి పేరొందినది. ఆ తర్వాత ఈ చిన్నదానికి సినిమా ఆఫర్స్ వచ్చాయి. శ్రీవిష్ణు సరసన 'ఓం భీమ్ బుష్' సినిమాతో హీరోయిన్ గా మారింది.'ఓం భీమ్ బుష్' చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఈ సినిమాలో ప్రీతి ముకుందన్ అందంతో పాటు అభినయంతోనూ ఆకట్టుకుంది. ఇక ఇప్పుడు కన్నప్ప సినిమాలో గ్లామర్ లుక్ లో మెరిసింది. కాగా ఈ అమ్మడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. తాజాగా ఈ చిన్నది కొని క్యూట్ ఫోటోలు షేర్ చేసింది. ఈ చిన్నదాని ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.ఈ ఫోటోల పై నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. కాగా కన్నప్ప సక్సెస్ తో ప్రీతీ క్రేజీ ఆఫర్ అందుకుంది. నివిన్ పాలీ సినిమాలో ప్రీతీ హీరోయిన్ గా ఫిక్స్ అయ్యింది.



## Kavya Thapar

# డేజ్లింగ్ కావ్య..

కావ్య ప్రవీణ్ థాపర్.. తెలుగు, తమిళం, హిందీ చిత్రాల్లో కథానాయికగా బాగా ఫేమస్.. ఈమె పూర్తి పేరు కావ్య ప్రవీణ్ థాపర్. చేసింది తగ్గువ సినిమాలే అయినా కుర్రకారులో మంచి క్రేజీ సొంతం చేసుకుంది ఈ బ్యూటీ. ఎప్పుడు సోషల్ మీడియా వేదికగా అభిమానులతో ఫోటోలను పంచుకుంటుంది ఈ బ్యూటీ. 20 ఆగస్టు 1995న మహారాష్ట్ర రాష్ట్ర రాజదాని ముంబై మహానగరంలో పుట్టి పెరిగింది వయ్యారి భామ కావ్య థాపర్. ఈమె తండ్రి విక్కీ థాపర్ ఓ వ్యాపారవేత్త. తల్లి ఆర్తి థాపర్ గృహిణి. ఈమెకి అభిమన్యు థాపర్ అనే ఓ సోదరుడు కూడా ఉన్నాడు. మహారాష్ట్రలోని ముంబైలో ఉన్న పోవైలో బాంబే స్కాటిష్ స్కూల్ లో పాఠశాల విద్యను పూర్తి చేసింది ఈ అందాల తార. ముంబైలోని ఠాకూర్ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ కామర్స్ నుంచి అండర్ గ్రాడ్యుయేట్ పట్టా పొందింది ఈ అందాల భామ. సినిమాలకి ముందు పతంజలి, మేక్‌మైట్రిప్, కోహినూర్ వంటి అనేక వాణిజ్య ప్రకటనలలో నటించింది ఈ వయ్యారి భామ. 2018లో ఈ మాయ పేరేమిటో అనే తెలుగు రొమాంటిక్ చిత్రంలో కాదహనాయకిగా చలనచిత్ర అరంగేట్రం చేసింది ఈ ముద్దుగుమ్మ. 2021లో సంతోష్ శోభన్ సరసన ఏక్ మినీ కథ అనే తెలుగు అడల్ట్ కామెడీ చిత్రంలో హీరోయిన్ గా ఆకట్టుకుంది ఈ భామ. గత ఏడాది ఈమె నటించిన ఈగల్, ఊరు పేరు భైరవకోన, డబల్ ఇస్మార్ట్, విశ్వం సినిమాల్లో కథానాయికగా కనిపించింది. ఈమె 2021లో కాళీ పీలీ టేల్స్, 2022లో, 2023లో ఫర్జీ అనే మూడు వెబ్ సిరీస్ లు కూడా చేసింది. తమిళంలో కూడా మార్కెట్ రాజా ఎంబిబిఎస్, పిచైకారన్ 2 (తెలుగులో బిచ్చగాడు 2) చిత్రాల్లో నటించింది. అలాగే హిందీలో మిడిల్ క్లాస్ లవ్ అనే సినిమా చేసింది.




## మళ్లీ వాయిదా పడిన అనుష్క 'ఘాటీ'.. ప్రకటించిన మేకర్స్

టాకీస్: టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'ఘాటీ' మరోసారి వాయిదా పడింది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. సినిమా అనేది ఒక జీవనది లాంటిది. కొన్నిసార్లు ఉరకలు వేస్తుంది.. కొన్నిసార్లు లోతు పెంచుకోవడం కోసం ఆగుతుంది. ఘాటీ కేవలం ఒక సినిమా కాదు. అది పర్వతల ప్రతిధ్వనులు, అడవి గాలి, ప్రకృతి నుంచి చెక్కబడిన అద్భుతమైన కథ. ఈ సినిమాలోని ప్రతి ఫ్రేమ్ అద్భుతంగా మారడం కోసం, సినిమాను వాయిదా వేయాలని మేము నిర్ణయించుకున్నాము. సినిమాపై మీకున్న ప్రేమకు, మీ సహనానికి మా కృతజ్ఞతలు. అవుట్‌పుట్ అత్యుత్తమంగా వచ్చిన తర్వాతే సినిమాను విడుదల చేస్తామని అధికారికంగా ప్రకటిస్తున్నాము అంటూ టీమ్ ప్రకటించింది. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో అనుష్క నటిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. యూవీ క్రియేషన్స్ సమర్పణలో, రాజీవ్ రెడ్డి, సాయిబాబా నిర్మిస్తున్న ఈ చిత్రం నుండి విడుదలైన గ్లింప్స్ ఇప్పటికే ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. తాజా సమాచారం ప్రకారం, సినిమాకు సంబంధించిన సీజీ (కంప్యూటర్ గ్రాఫిక్స్) పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, విడుదల తేదీ లోపు అవి పూర్తయ్యే అవకాశం లేదని తెలుస్తోంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.